
మహాభారతం

# ధర్మ విజయము



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org
Mobile App: Free Gurukul
email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul
Help Line / WhatsApp: 904 202 0123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఐవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# ధర్మవిజయము

## (ఉపవాచకము)

గ్రంథకర్తలు:

కీ॥ శే॥ విద్వాన్ : అష్టావధాని : అల్లసాని రామనాథ శర్మ

విద్వాన్ : దండిపల్లి వేంకటసుబ్బాశాస్త్రి

పబ్లిషరు:

బాలసరస్వతీ బుక్ డిపో,

ఎడ్యుకేషనల్ పబ్లిషర్సు,

కర్నూలు.

[బ్రాంచి ఆఫీసు : 6, సుంకురామ శెట్టివీథి, మద్రాసు

కాపీరైటు రిజిష్టర్డు]

1960

# విషయసూచిక

—:o:—


| విషయము | | పుట |
|---|---|---|
| 1. పాండురాజు | ... | 1 |
| 2. ధర్మరాజ జననము | ... | 5 |
| 3. హస్తినాపుర ప్రవేశము | ... | 9 |
| 4. దుర్యోధనుని దురాలోచనలు | ... | 11 |
| 5. వివాహోదంతము | ... | 18 |
| 6. రాజసూయాధ్వరము | ... | 25 |
| 7. మాయాద్యూతము | ... | 31 |
| 8. (i) పాండవుల వనవాసము | ... | 39 |
| (ii) పుణ్యకథా శ్రవణము | ... | 43 |
| (iii) ధర్మజుని దయాగుణము | ... | 46 |
| 9. (i) అజ్ఞాతవాసము | ... | 58 |
| (ii) రాయబారములు | ... | 59 |
| 10. (i) కురుక్షేత్రము | ... | 68 |
| (ii) భీష్ముని సమరము | ... | 65 |
| (iii) ద్రోణుని సంగరము | ... | 70 |
| (iv) కర్ణుని కదనము | ... | 78 |
| (v) ధర్మరాజు శల్యుని వధించుట | ... | 82 |
| (vi) దుర్యోధనుని మరణము | ... | 88 |
| (vii) అంత్యక్రియలు | ... | 88 |
| 11. ధర్మరాజ పట్టాభిషేకము | ... | 94 |

# 1

## పాండురాజు

శ్రీల కాలవాలమై, పరాక్రమ పౌరుషముల కునికి పట్టగు హస్తినాపురమును ధృతరాష్ట్రుఁ డను రాజు పాలించుచుండెను. ఆ రాజు పుట్టుగ్రుడ్డి యయినను గుణవంతుఁడు, సాహసవంతుఁడు, రాజకార్యదక్షుఁడు నగు సోదరుఁడు పాండురాజు సహాయమున నెట్టి లోటుపాటులును లేక రాజ్యపాలనమును నేర్పుతో నొనర్చుచుండెను. అతని భార్య గాంధారి.

'పూవు పుట్టుటతోడనే పరిమళము వ్యాపించు' నన్నటులఁ బాండురాజు పిన్నవయస్సునందే తనగుణగణములవలనఁ బ్రజల మెప్పు నందుచుండెను; తన శౌర్య పరాక్రమములచే శత్రువులకు భయ మొనఁగూర్చుచుండెను; తన దానములచేత యాచకుల మనస్సులను సంతృప్తిపఱచుచుండెను; నిరుపమానమైన తన సౌందర్యముచేత స్త్రీలచిత్తముల నాకర్షించుచుండెను.

పేరునకు మాత్రము ధృతరాష్ట్రుఁడు రాజు. కాని రాజ్యభారము నంతటిని పాండురాజే వహించెను. అతని గుణగణములు, పరాక్రమ పౌరుషములును భరతఖండమంతటను బ్రశంసింపఁబడుచుండెను.

గుణవతియు, సౌందర్యవతియు నగు పృథ యను కన్యను పాండురాజు స్వయంవరమున వివాహమాడెను. భీష్మాది ప్రముఖుల పనుపున మద్రరాజపుత్రిక యగు మాద్రి యను వధూరత్నముఁ జేపట్టెను. వారితో నానందముగఁ గాలము గడుపుచుండఁ గొంతకాలమునకు దిగ్విజయము సేయవలయు నను వాంఛ యతనికిఁ గల్గెను.

పాండురాజు రథ, గజ, తురగ, పదాతుల నాయత్త పఱచుకొని దిగ్విజయార్థము బయలుదేరెను. కాలు కదిపినది మొద లతనికి జయశ్రీ యెదురుగా నేఁగుదెంచి స్వాగత మొసంగుచుండెను. నాలుగు దిక్కులను జయించి పరాజితు లైన భూపాలు రొసంగు దాసదాసీజనములను, గజాశ్వాదులను, ధనధాన్యాదులను, రత్నరాశులను గప్పములుగాఁ దీసికొని వచ్చి యతఁడు తన యన్న పాదములకడఁబెట్టి నమస్కరించెను. ధృతరాష్ట్రుఁడు తమ్ముని పరాక్రమమును వేనోళ్ళఁ బొగడెను. దిగ్విజయము పొంది తిరిగి వచ్చిన తన్నుఁజూచుటకు వచ్చు బ్రాహ్మణ యాచక బృందములకు భూరిదానముల నొసఁగి పాండురాజు వారి నందఱను సంతోషపెట్టెను.

కొంతకాలము దిగ్విజయ శ్రమను దీర్చుకొన్న పిదప వేటకుఁ బోవలయునను తలంపు గలిగి పాండురాజు తన సతు లగు కుంతీ, మాద్రులతోడఁ గూడి హిమవత్పర్వత దక్షిణ పార్శ్వమునఁ గల యరణ్యములకు వెళ్లెను. ధృతరాష్ట్రుఁ

డాహార పదార్థముల ననుదినము పంపుచుండ నతఁ డ్దేపనిగ వేఁట సల్పుచు, వివిధములగు క్రూరమృగంబులను వధించుచు నానందించుచుండెను.

ఒకనాఁ డతని కంటి కా యరణ్యములో నొక్క మృగమైనను గనుపింపలేదు. విసుగుచెంది తుద కాతఁడొక వృక్షముక్రిందఁగూర్చుండి యేదేని వన్యమృగము కనుపించు నేమో యని నిరీక్షించుచుండెను; కొంచెము దూరమున లేళ్ళ యలికిడి వినిపించెను. విల్లెక్కు పెట్టి నెదుకఁగ నొకదానితో నొకటి పెనవైచుకొని రెండులేళ్లు సరసక్రీడఁ దవిలి యుండుటఁ గాంచి పాండురాజు కొంచెమైన నోపిక పట్టఁజాలక బాణమును వదలెను. లేళ్ళు గిఱ్ఱునఁదిరిగి విలవిలఁ దన్నుకొని క్రిందఁబడి యెను. ఆడులేడి యసువులఁబాసెను. మగలేడి మరణా యాసముతో మనుష్యభాషలో నిట్లనియె– ''ఓ పాండు రాజా! నేను కిందముఁ డను మునిని. నిరంతరము సుఖపడ వలయు ననెడు నపేక్షచే నా భార్యయును, నేను నిట్టి మృగ రూపము లెత్తి సుఖించుచుంటిమి. సరసక్రీడఁ దవిలియున్న మమ్ము నిర్దయుఁడవై నీవు వధించితివి. బోయవాఁడు కూడఁ జేయనట్టి దుష్కృత్యముఁ జేసితివి కావున నీవు నీ భార్యతోఁ గూడినప్పుడు వెంటనే మరణించెదవు గాక! నీ భార్యయు నీతో మరణముఁ బొందు.''నని శపించి యా మృగము కూడ మరణించెను.

నిరంతరము సతీసుఖమును గోరు పాండురాజున కీ శాపము 'బల్లెపుఁబోఁటువలె' హృదయమును కలఁతపెట్ట

సాగెను. తన జీవిత మంతయు నిఁకమీఁద వ్యర్థమని తలపోసి, యతఁడు కుంతీమాద్రులఁ బిలిచి, తన శాపవృత్తాంతమును దెలియపఱచి "నాకిఁక భోగముల కవకాశము లేదు. మునివృత్తియే శరణ్యము; కావున నేఁటినుండి సర్వసంగములను పరిత్యజించి, సమస్త భూతములందును సమంబుగ మెలఁగుచు హింసను దలపెట్టక కాలము గడపెదను. మీరలు హస్తినాపురమున కేఁగుఁడు" అని చెప్పెను. కుంతీమాద్రులు దుఃఖముతో బాధపడుచు "మీకులేని సౌఖ్యములు మాకు మాత్ర మేల? మీ వెంట మేముగూడఁ దప మొనర్చుకొనుచుండెదము. వానప్రస్థాశ్రమమును స్వీకరించి తపముఁ జేయుఁ" డని ప్రార్థించిరి. పాండురాజందుల కొడంబడి సతీసహితుఁడై హస్తినాపురమునకు వెళ్లి ధృతరాష్ట్రాదులకు తన శాపవిషయమును, స్వనిర్ణయము నెఱిఁగింప వారును శోకించిరి. విధివైపరీత్యముఁ దప్పింప నెవ్వరికిఁ దరమగును ?

బ్రాహ్మణులు మున్నగువారి కనేక దానము లొసఁగి, విధ్యుక్తముగ మౌనివేషము ధరించినవాఁడై తన భార్యలు వెంటరాఁగా ననేక పర్వతములను, నదులను దాఁటి శతశృంగమను పర్వతముఁ జేరి పాండురాజు తపముఁ జేయ నారంభించెను.

# 2

## ధర్మరాజ జననము

ఒకనాఁడు ఋషులు స్వర్గమార్గమునఁ బోవుచుండుటఁ జూచి తానును బోవలయు ననెడు కోర్కె వొడమఁగా పాండురాజు భార్యాసహితుఁడై యా మార్గముఁ బట్టెను. మార్గ మంతయు సమతలముగఁ గాక హెచ్చుతగ్గులుగ నున్నందున వారు శ్రమపడుచుండుటఁ గాంచి ఋషులు "పాండు మహారాజా! ఇది దేవపథము. మానవు లీక నడువఁజాలరు. మీ రిక్కడనే నిలువుఁడు" అని చెప్పఁగాఁ దనకు బుత్రులు లేని విషయమును జ్ఞప్తికిఁ దెచ్చుకొని "ఋషిశ్రేష్ఠులారా! కులగోత్రముల కభ్యుదయకరమును,మహానంద మనుభవించుట కాయువుపట్టును, పితృదేవతల మనుగడకు మూలకందము నైన సంతానప్రాప్తి గలుగమి నేనెంతయు వగచుచున్నాఁడను. పుత్రహీనులకు స్వర్గప్రాప్తి లేదనియు వింటిని. నన్నెటులైనఁ గరుణించి యుద్ధరింపుఁ"డని వేఁడుకొనియెను. ఋషులు యోగదృష్టితో ననాగతం బెఱిఁగి "నీ వపుత్రకుఁడవు గావు. దైవాధిష్ఠిత మగు సంతానము నీకు యముఁడు, వాయువు, ఇంద్రుఁడు, అశ్వినీదేవతలు అను దేవతల మూలమునఁ గలుగును గానఁ బ్రయత్న మొనరింపు" మని యాదేశించి వెడలిపోయిరి.

నిరాశతో నున్న యా పాండురాజున కుత్సాహము కలిగెను. ఆతని ముఖవర్చస్సులో నొక క్రొత్త యందము

తోఁణికిసలాడెను. తామరతంపరగఁ దన వంశము వృద్ధిఁ బొందఁగల దను ధైర్యము గల్గెను. ఎప్పటియట్ల తప మాచరించుచుఁ బుత్రావాప్తికొఱకై యతఁడనేక విధములైన యుపాయము లాలోచింపసాగెను. ఒకనాఁ డేకాంతమునఁ గుంతితో "సంతానవిహీను లగువారలకు దాన, దక్షిణ, యజ్ఞాదులవలన స్వర్గప్రాప్తి కలుగదు. ధర్మదూషితము గాని తెఱఁగునఁ బుత్రలాభ మగునటు లాలోచింపు" మని చెప్పెను. దానికిఁ గుంతి "నాకు దుర్వాసమహర్షి పిన్నతన మున నొక మంత్ర ముపదేశించి యుండెను. ఆ మంత్రముతో నేదేవత నాహ్వానించిన నాదేవత నాకు ప్రత్యక్షమై కోరిన కోర్కె లొసఁగును. మీ యాజ్ఞయైన నట్లొనర్చెద" నని సవినయముగఁ జెప్పెను. పాండురాజు పరమానందభరితుఁడై "ప్రపంచమంతయు ధర్మమునందే యాధారపడి యున్నది. సత్యధర్మములందును, దేవతలందును పెద్ద యయినవాఁడు ధర్ముఁడు గావున నతనినే యాహ్వానింపు" మనియెను.

కుంతీదేవి శుచియై భర్తకుఁ బ్రదక్షిణంబు గావించి దుర్వాసుఁ డుపదేశించిన మంత్రముఁ బఠించి యారాధించిన నతఁడు ప్రత్యక్షమై పుత్రభిక్ష నొసఁగి వెళ్లెను. కుంతి గర్భము దాల్చి దశమమాసమున, శుభలగ్నమునందు, శత్రువులను జయించెడి తేజము గలవాని నొక కుమారుఁ బ్రసవించెను.

బ్రాహ్మణులు మొదలుగాఁగల చరాచర ప్రపంచ మెల్లయు గుణనిధి యగు నబ్బాలకుని జననమువలన పరమా నంద మొందెను. ఆ శతశృంగమున నున్న మునులెల్లరుఁ గలిసి యబ్బాలకునకు జాతకర్మాదికములను నిర్వర్తించిరి. ఆకాశవాణి "కురుకులమున కధిపతియై ధర్మమునందును, యుద్ధమునందును నిలుచుఁగావున నితనిని యుధిష్ఠిరుఁడనఁ జెల్లును" అని సకల జనులు వినుచుండఁ బలికెను. ధర్ముని యంశమున జనించినవాఁ డగుట ధర్మజుఁ డనియు,ధర్మాత్ముం డగుట ధర్మరాజనియు నా బాలునిఁ బిలువసాగిరి. పుత్ర లాభముఁ బొందినవాఁడై పాండురాజు మహానంద మనుభవించు చుండెను.

కృష్ణద్వైపాయనుని వరంబుకతన గర్భవతియైన గాంధారి ధర్మరాజ జననము విని తనకు పండ్రెండవ మాసము వచ్చినను పుత్రలాభము గలుగమిని వగచి యుదరతాడన మొనర్చుకొనఁగా గర్భము విచ్ఛిన్న మయ్యెను. త్రికాలజ్ఞుఁ డగు కృష్ణద్వైపాయనుఁ డీ విషయముఁ దెలిసికొని వెంటనే గాంధారికడకు వచ్చి "నీవు చాల తప్పుపని చేసితివి. ఇమ్మాంసపిండమును భద్రముగ రక్షించుకొనుము. దీనినుండి నీకు నూరుగురు పుత్రు లుదయింతురు; ఒక పుత్రికయుఁ గల్గు" నని చెప్పి యామెవగపును మాన్పి వెడలిపోయెను. ఆ మాంస పిండమును గాంధారి సురక్షితప్రదేశమున నుంచి కాపాడు కొనుచుండెను.

పాండురాజునకు ధర్మజుని జననముతోఁ దృప్తి గలుగ లేదు. కుంతీదేవిని వాయుదేవునివలనను, ఇంద్రులవలన నిరువురు

పుత్రులఁ బడయవలసినదని నియోగించెను. ఆమె తన మంత్ర ప్రభావమునం జేసి వాయుదేవునివలన భీముఁ డనువాని, నింద్రుని వలన నర్జునుఁ డనువానిఁ బడసి పతికోరికఁ దీర్చెను.

గ్రుడ్లగూబలును, పశుపక్ష్యాదులును విపరీతధ్వనులఁ జేయుచుండ, దిశలును, భూమియు వణఁకుచుండ, రక్త వర్షము లాకాశమునుండి కురియుచుండ గాంధారీ, ధృత రాష్ట్రులకు అగ్రపుత్రుఁడై దుర్యోధనుఁ డనువాఁడు జన్మిం చెను. ఆ సమయమున నుద్భవిల్లిన మహోత్పాతములఁ గాంచి జనులెల్లరు నీ బాలకుఁడు 'కులనాశకుఁ' డగు నని తలపోసిరి. గాంధారికిఁ గ్రమముగ నొక్కొక దినమున కొక్కొక పుత్రు డుదయింపసాగెను. నూర్వురు పుత్రులు జనించిన వెనుక దుశ్శల యను పుత్రికయుఁ గల్గెను. వారింగాంచుచు గాంధారీ, ధృతరాష్ట్రు లానందముతోఁ గాలము వెళ్ళఁబుచ్చుచుండిరి.

కుంతీదేవికి ముగ్గురు సుతులు జనించుటయు, గాంధారి నూర్వురు పుత్రులఁ బడయుటయుఁ దలఁచుకొని మాద్రి తనకు సంతానము లేమి వగచుచు భర్తతో నొకనాఁ డేకాంతమున ఖిన్నవదనయై "నాథా! నా గర్భముగూడ ఫలింపకపోయెనే యను చింత నన్నెక్కుడుగ బాధించుచున్నది. కుంతితోఁ జెప్పి నాకు నమ్మంత్ర మొసఁగునట్లు చేయుఁడు. దాన సంతానప్రాప్తి యగునేమో!" అని వాపోయెను; పాండు

రాజు కుంతి నట్లు సేయుమని యాజ్ఞాపింపఁగా నామె 'వల్లె' యని మాద్రికి మంత్ర ముపదేశించెను. పాండురాజునాజ్ఞఁగొని మాద్రి మంత్రశక్తితో నశ్వినీదేవతల నాహ్వానించి పుత్రభిక్ష వేఁడఁగా వారు వర మొసంగిరి. మాద్రి గర్భము దాల్చి కవలఁ గనియెను. ఆకాశవాణి నకుల సహదేవులని వారికి నామకరణము చేసెను.

భార్య లిద్దఱు నల్లారుముద్దుగ బుత్రులను లాలించి పాలించుచుండుటఁ గాంచి పాండురాజు తనలోఁ దాను పొంగి పోయెను. కొంతకాల మిట్లు గడచినది.

—:o:—

# 3

## హస్తినాపుర ప్రవేశము

సకలప్రాణి సంతోషకర మగు వసంతర్తువు వచ్చుట తోడనే భూలోకమున కొక వింత శోభ కల్గినది. లతలు పుష్పితములై నయనోత్సవకరముగ నుండెను. కోయిలల మధుర 'కుహూ' నాదములు శ్రవణానంద దాయకము లయ్యెను. శతశృంగపర్వతము శృంగారరసమున కుద్దీపన మయ్యెను.

మాద్రిసౌందర్యము పాండురాజు మనస్సును జలింపఁ జేసెను. శాపపీడితుఁ డగుట వెంటనే పాండురాజు పరలోకగతుఁ డయ్యెను. 'భర్త మరణించిన తర్వాత బ్రతుకుటవలన

బ్రయోజనము లే' దని నిశ్చయించుకొని కుంతీదేవికిఁ దన కుమారుల నప్పగించి మాద్రి భర్తతో సహగమన మొనర్చెను.

అచటి మునులు దుఃఖ నిమగ్నలై యున్నకుంతిని, ఆమెపుత్రుల నోదార్చి వారలఁ దోడ్కొని హస్తినాపుర మున కేతెంచిరి. పౌరులెల్లరును 'పాండురాజసూను లెట్లు న్నారో?' యని వీథులవెంట బారులుదీఱి సింగపుఁగొదమల వలె నున్న యా రాజకుమారులఁ జూచుచు వారిసౌందర్యము ననేకవిధములఁ బొగడసాగిరి. కుంతి, పుత్రులతోడఁ గలిసి రాజద్వారముఁ గడచి, రాజమందిరములోనికిఁ బ్రవేశింపఁగా మంత్రి పురోహిత బ్రాహ్మణ పురస్కృతుఁడై, దుర్యోధన, దుశ్శాసనాది పుత్రులతోను, భీష్మవిదురాది బంధువులతోను ధృతరాష్ట్రుఁడెదుర్కొని యాబాలుర నాశీర్వదించి, ముద్దిడు కొని పాండురాజ మరణవార్త విని శోకించెను. బంధుజనులు శోక మపనయింప ధృతరాష్ట్రుఁడు పాండురాజునకు యథా విధిగ శ్రాద్ధాది కర్మములు జరిపించెను.

ధర్మరాజాదులు, దుర్యోధనాదులతోఁ గలిసి క్రీడించు చుండిరి. క్రమముగా పాండురాజతనూజుల యున్నతి దుర్యో ధనుని యందసూయాబీజము నంకురింపఁ జేసెను.

—:o:—

# 4

## దుర్యోధనుని దురాలోచనలు

ఆటపాటల నొండొరులు కలసి కౌరవ పాండవులు కాలమును వెళ్ళఁబుచ్చుచుండిరి. దుర్యోధనునకు భీమునిపై ద్వేషము జనించి యది నానాఁటికిని వృద్ధికాఁజొచ్చెను. అతఁడు భీమునిఁ బరిమార్చుటకు తమ్ములతో దురాలోచనలఁ జేయసాగెను. ఒకనాఁడు క్రీడించుటకై వారందఱును సముద్ర ప్రాంతమున కేఁగిరి. రాత్రియగుట నందఱు నచ్చటనే శయనించిరి. ధర్మరాజాదులే కపటముల నెఱుంగనివా రగుట చేతను, క్రీడావ్యాసంగములచే నధికముగ నలసినవా రగుట చేతను, గాఢముగ నిద్రించిరి. మాయోపాయములు పన్ను దుర్యోధనుఁడు భీముఁ డొడలెఱుఁగక నిద్రించుచున్నాఁ డని యెఱిఁగి యతనిని పెద్ద తీగలతోఁ గట్టి సముద్రమునఁ బడవైచి తమ్ములతోఁ బ్రయాణమై పోయెను. భీముఁడు మెలఁకువ వచ్చి చూచుకొనుసరికి సముద్రమున నుండెను. అతఁడు కట్టిన తీగలను త్రెంపి సముద్రమునుండి ధర్మరాజుకడ కేతెంచెను. జరిగిన విషయమంతయు భీముఁడు చెప్పఁగా సోదరులందఱును విని యిఁకమీఁద జాగ్రతతో మెలగవలయు నని నిశ్చయించి దుర్యోధనుని దురాలోచనలను దలఁచుకొని మాటిమాటికి విచారించుచు హస్తినాపురముఁ జేరిరి.

భీముఁడు బ్రతికి వచ్చుటఁగాంచి దుర్యోధనుఁ డచ్చెరువడెను. తన ప్రయత్నము వ్యర్థమైనందుకు విచారించెను. పిదప భీముఁ డొకనాఁడు మైమఱచి నిద్రించుచుండగా దుర్యో

ధనుఁ డతనిని పాములచేఁ గఱపించెను. విషాన్నములఁ బెట్టించెను. భీముఁడు మృత్యువును జయించుచుండుటఁగాంచి దుర్యోధనుఁడు తమ్ములతో నాలోచించి ధర్మరాజాదుల నందఱను, వంచించుటకై యనేక విధములగు దురాలోచనలు చేయసాగెను.

పాండురాజునకు జనించిన వారలు గాఁబట్టి ధర్మరాజాదులను పాండవు లని జనులు వ్యవహరించుచుండిరి. దుర్యోధనాదులు కౌరవు లనఁబడిరి. ఒకవంకఁ గౌరవులకుఁ బాండవులపై మాత్సర్యము దినదినాభివృద్ధిఁగాంచుచుండెను. మత్సరగ్రస్తులైన కౌరవులు పాండవులను బాధించుటకై ప్రయత్నముల నొనర్చుచునే యుండిరి.

పాండవులును, గౌరవులును ద్రోణాచార్యుని కడ నస్త్రవిద్యాభ్యాస మొనర్ప మొదలిడిరి. వారలకు సత్వరముగ నస్త్రవిద్యయందుఁ బాండిత్యము గల్గెను. వారు వేదశాస్త్రములను కృపాచార్యునియొద్ద నభ్యసించిరి. భీష్మ, విదుర, కృపాచార్యులవలన ననేక నీతి నియమములను, హిత ప్రవర్తనములను దెలిసికొనిరి. కుశాగ్రబుద్ధు లగుటచే నెల్ల విద్యలు శీఘ్రకాలముననే యెఱిఁగి వారు పెద్దల మన్ననలకుఁ బాత్రులైరి.

ద్రోణాచార్యుఁడు తన శిష్యుల విద్యాకౌశల్యమును ప్రభువులకుఁ జూపుటకై 'అస్త్రవిద్యా ప్రదర్శన' మను

దాని నేర్పాటు చేసెను. కౌరవులును, పాండవులు నందుఁ బాల్గొనిరి. అర్జునుఁడు ప్రేక్షకులయెదుటఁ దన శక్తి సామర్థ్యములఁ జూపి పొగడ్తల నందెను. కౌరవుల శక్తిసామర్థ్యములు రాణింపక పోయెను. ఇట్లుండ నాజానుబాహుఁడు, సూర్యసమాన తేజస్వి, సహజ కవచకుండల మండితుండు నగు కర్ణుఁ డా జనసమూహమునుండి చొచ్చుకొని వచ్చి యర్జునుని తోడి ద్వంద్వ యుద్ధమునకుఁ దలపడెను. వా రిర్వురకును ఘోర సంగ్రామము జరిగెను. అట్టి తఱిఁ గృపాచార్యుఁ డడ్డు వచ్చిహఠాత్తుగాఁ గర్ణునితో "నీ తల్లి దండ్రులపేర్లు తెల్పి యుద్ధ మొనర్పు" మని నిర్బంధించెను. కర్ణుఁ డా విషయ మడుగుట తోడనే సిగ్గుపడి ముఖము వ్రేల వేసికొనెను. అర్జునునితోఁ బోరఁగల శక్తిమంతుఁ డని యెఱిఁగి దుర్యోధనుఁ డా కర్ణుని చేరఁజని ప్రతిజ్ఞా పూర్వకముగ స్నేహమొనర్చి యతని నంగరాజ్య పట్టాభిషిక్తు నొనర్చి, ప్రదర్శనమునఁ బాల్గొనఁ జేసి, మిక్కిలి గౌరవించెను.

అర్జునుని శక్తి సామర్థ్యములు నస్త్ర, శస్త్ర-విద్యా నైపుణ్యమును ప్రపంచమునఁ గీర్తింపఁబడుచుండెను. భీముని గదా యుద్ధప్రావీణ్యమునకు సాటి కన్పింపదయ్యెను. కవల రణకౌశలము 'మూడుపూవు లారుకాయలై' వెలసెను.

ధర్మరాజు శాంత స్వభావము—దయాళుత్వమును లోకము వేనోళ్ళఁ బొగడఁబడుచుండెను. అతని వయసు చిన్న

దైనను బుద్ధి గొప్పది. అతఁడు శత్రువునైనను గరుణించును. దుర్యోధనాదులదుష్టస్వభావమునకుఁ గినియఁడు. 'సముద్రమెంత యుప్పొంగినను చెలియలికట్ట దాఁటి రానట్లు' తమ్ము లెంతటి వీరులైన నన్న మాటను జవదాఁటకుండిరి. ధర్మరాజు తమ్ములను లాలించి తండ్రివలెఁ బాలించును. గురువువలె హితోపదేశ మొనర్చును. మిత్రునివలెఁ గలిసిమెలసి తిరుగును. అతని కొరులను ద్వేషించు స్వభావము లేదు. తన కపకార మొనర్చినవానికైన నుపకారముఁ జేయుటకే పూనుకొనును. అందుకే యతఁ డజాతశత్రుఁడని పిలువఁబడుచుండెను.

'అగ్ని దేవునకు వాయుదేవుఁడు తోడైనట్లు దుర్యోధనునకుఁ గర్ణుఁడు మిత్రుఁడైనప్పటినుండియుఁ బాండవులపైఁ గల యసూయా ద్వేషములు నానాఁటికి నధిక మయ్యెను. 'నీటికిఁ బాఁచి తెగు' లన్నటుల బలవంతునిఁ జూచిన బలవంతునకు ద్వేషము గల్గుట సహజము. పాండవులు బలవంతులు. వారి మనుగడ తన కే నాఁటికైనను ముప్పు తెచ్చునని దుర్యోధనుఁడు నిశ్చయించుకొనెను. కర్ణునితో నొకనాఁడు దుర్యోధనుఁడు "పాండవుల నిచట వంచించుట కష్టతరము. అందు వలన వారిని వారణావతమునకుఁ బంపించిన వంచించుటకు వీలు గలుగును. ఇచట భీష్మ, విదురాదు లడ్డుపడుచుందురు. మా జనకునితో నీ విషయముఁ జెప్పి యొప్పింపఁగల"నని చెప్పఁగాఁ గర్ణుఁ డందులకుఁ దల యూఁచి "మంచి యుపాయ మాలోచించితివి. అటులనే చేయు" మనెను.

దుర్యోధనుఁడు వెంటనే ధృతరాష్ట్రునిచెంత కేఁగి కపటనటనానైపుణ్యముఁ బ్రదర్శించుచు "తండ్రీ! నీవు నా సౌఖ్యముఁ గోరినవాఁడ వయినయెడల వెంటనే పాండవుల నేదియో యొక నెపమున వారణావతమునకుఁ బంపుము. 'పామున్న యింటిలోఁ గాఁపురముఁ జేసినట్లు' నా కహితు లైన పాండవు లిచ్చటనున్న నామనసు స్తిమితముగా నుండదు" అని ప్రార్థించుచు నెంతయో వాపోయెను. ధృతరాష్ట్రుఁ డడ్డంకులు, ధర్మపన్నముల నెన్నిటిని చెప్పినను దుర్యోధనుఁడు వినిపించుకొనలేదు. తుదకుఁ బాండవులను వారణావతమునకుఁ బంపెద నని కుమారు నూరడించెను.

తండ్రి తన మాటలను విన్నందులకు దుర్యోధనుఁ డుప్పొంగిపోయెను. త్వరలోఁ బాండవులు వారణావతమునకుఁ బోవుదు రని శిల్పకళానిపుణుఁ డగు పురోచనుఁడను నొక విశ్వకర్మని బిలిపించి వానితో "పాండవులు వారణావత మునకుఁ బోవ నున్నారు. నీవు క్షణమైన నాలస్యము చేయక యచటి కేఁగి రాజభవనమున శయనగృహముగా ఒక లాక్షా గృహమును నిర్మింపుము. వారు గాఢనిద్రలో నున్నసమయ మున నా గృహమునకు నిప్పు తగిల్చి వారి మరణముఁ గను లారఁ జూచి ర"మ్మని చెప్పి పంపెను.

పాండవుల నిష్కపట హృదయమున దురూహలఁ గూర్చిన యాలోచనయే లేదుగదా? ధృతరాష్ట్రుఁడు వారణా వతమునకుఁ బొండని యాజ్ఞాపించిన మరుక్షణముననే ధర్మ

రాజు తమ్ములతోడను, తల్లితోడను గలిసి యచటికిఁ బ్రయాణమయ్యెను. పౌరుల కెల్లరకుఁ బాండవుల ప్రయాణ మున కర్థము తెలియలేదు. వారు 'కుమారుని దురాలోచనలకు లొంగి ధృతరాష్ట్రుఁ డిట్లొనర్చె'నని యనుకొనిరి. బంధువులు, సేవకులు వారిని సాగనంపుటకై వచ్చిరి. విదురుఁడు ధర్మ రాజునకు రహస్యముగా "దుర్యోధనుఁడు దుర్మార్గుఁడు. వాఁ డెన్నియో మాయోపాయములు పన్నుచుండును. విషాగ్నుల విషయమున జాగ్రతతో మెలఁగుచుండు"డని హెచ్చరిక గావించెను. ప్రస్థానవేళఁ దన తమ్ములకుఁ, దల్లికి నీ విష యముఁ జెప్పఁగాఁ దమపై విదురునకుఁగల ప్రేమాతిశయము నకు వారెంతయు సంతసించిరి,

పురోచనుఁడు పాండవులు వారణావతముఁ జేరు లోప లనే లక్కతోనొక చతుశ్శాలాభవనమును చిత్ర విచిత్రముగ నిర్మించెను. పురవాసులెల్లరును స్వాగత మొసగఁగాఁ బాండు సూనులు రాజాంతఃపురముఁ బ్రవేశించిరి. కొంతకాలమునకు శయనగృహము లక్కతో నిర్మింపఁబడిన దని యెఱిఁగి కడు జాగరూకతతో మెలఁగుచుండిరి.

విదురుఁడు దుర్యోధనుని దురాలోచనను దెలిసికొని యొక ఖనకుని బాండవులయొద్దకుఁ బంపించెను. వాఁ డున్నరూ పెఱిఁగించి లాక్షాగృహమునుండి బయటఁబడుట కొక బిలమార్గ మేర్పఱచెను. పిమ్మటఁ గొండొక దినంబున గాఢముగఁ బాండ వులు నిద్రించుచుండ పురోచనుండు లాక్షాగృహముఁ దగుల

బెట్టెను. పాండవులు మేల్కాంచి మంటలు దరిकొనుటఁ జూచి బిలమునఁ బ్రవేశించిరి. భీముఁ డందఱఁ దనపై నెక్కించుకొని బయటికి వచ్చెను. భీముఁడు పథశ్రమాకులితుఁడై "దుర్యోధనుని దురాలోచనలు మేరలు మీఱుచున్నవి. ఇంక నతఁడు క్షంతవ్యుఁడు గాఁ"డని మెయివెంచి గద నెత్తెను. అర్జునుఁ డా యవకాశమును పురస్కరించుకొని "శత్రుత్వమును సహించుట వీరుల ధర్మము గా"దని ధనువును వీక్షించెను. తమ్ములు క్రుద్ధులై దుర్యోధనుని నిధనమున కుత్సహించుచున్నారని ధర్మజుఁ డెఱింగి వారల నుపశమింపఁ జేయ "సోదరులారా! మీ మనోగతాభిప్రాయమును నే నెఱుఁగుదును. మానవుని వినాశమునకుఁ గ్రోధమును, పగయు దారి తీయునను విషయము మీకుఁ దెలియనిది కాదు. దుర్యోధనుఁ డీర్ష్యాళువై యెట్లు చేసినఁ జేయనిండు. మన మట్టి దుర్ణయములకుఁ గడంగకూడదు. వాని దురాలోచనలు పరిపక్వమైన భగవంతుఁడే దానికిఁ దగిన శాస్తి యొనరించును. ప్రారబ్ధ కర్మఫలముల ననుభవింపవలసినదే కదా! న్యాయమునకును, ధర్మమునకు నపజయ మెక్కడిది? వాని నారాధించి, యనుష్ఠించువారి కెన్ని యుగములకైన క్షతి లేదు. క్రోధమును గ్రోధముతో జయించుటకంటె శాంతముతో జయించుట సులభము. మన కెన్ని దోసఁగులు సేసినను దుర్యోధనుఁడు బంధువు; అట్టివానిని బ్రేమించుట మన విద్యుక్తధర్మము. మీ మనస్సును నిష్కల్మషము నొనర్చుకొని, భావికార్య

క్రమమును నిర్ణయింపుఁ” డని వారల యాత్మలందున్న క్రోధ మను కసవును బెఱికి వైచి శాంతిబీజములను నాటెను. ఆహా ! అజాతశత్రుని శాంతస్వభావ మనితరసాధ్యము గదా! భీమార్జునులు నిరుత్తరులైరి. క్షణకాలమునకు ముందు వారి ముఖములఁ బ్రతిబింబించిన క్రోధచ్ఛాయలు పైదొలఁగెను— ముఖములు శాంతముతోఁ బ్రసన్నము లయ్యెను.

---

# 5

## వివాహోదంతము

లాక్షాగృహ దహనవృత్తాంతమును విని పాండవులు మరణించి యుందురని కౌరవులు నమ్మిరి. భీష్మ, ద్రోణ, విదురాదులు దుర్యోధనుని దౌర్మార్గ్యముఁ దూలనాడిరి. ప్రజలలో నీ వార్త యట్టుడికిన ట్లుడికిపోయెను. ధృతరాష్ట్రుఁడు పుత్రునకు లోఁబడి నోరు మెదల్పఁడయ్యెను.

పాండవులు మహారణ్య మార్గమునఁ బడి పోసాగిరి. హస్తినాపురమునకు వచ్చుటకు వారికి మనస్కరింపదయ్యెను. నిగూఢముగఁ గొంత కాలము సంచరింపఁదలఁచియొండకన్నెఱుఁగని యా శరీరములను నిరంతరము శ్రమఁబెట్టుచు వారరణ్య ప్రాంతములఁబడి పోవుచుండిరి. ఒకనాఁడు వారొక చెట్టుక్రిందఁ బడి మార్గాయాసమునఁ జేసి యొడలెఱుఁగక నిద్రించు

చుండఁగా భీముఁడు వారికిఁ గావలిగాచుచు మేల్కొని యుండెను. హిడింబి యను రాక్షసి భీముని సౌందర్యమును జూచి మోహించి వివాహమాడ బలవంతపెట్టసాగెను. భీముఁ డేమియు మాటాడలేదు. ఇంతలో నామె సోదరుఁడగు హిడింబుఁడనువాఁడు సోదరిని వెదకుకొనుచు వచ్చి యామె భీముని వలచి యుండుటను గ్రహించి మండిపడి బల గర్వితుఁడై పోరునకుఁ దలపడియెను. భీముఁడు వానిని క్రిందఁ బడవైచి ముష్టిఘాతములఁ దల్లడింపఁజేసి విగతాసుని గావించెను. ధర్మరాజు మేల్కాంచి జరిగినదానిని దెలిసికొని, భీముని సందేహమును గుఱుతించి "వాయుపుత్రా నీ వామెను రాక్షసి యని బాధపెట్టవలదు. ఈమెవలని యాపద శంకింప నేల? ఆపద పైఁబడ నున్నపుడును ధర్మరక్షణమే కర్తవ్యముగాన నీమె వాంఛ తీర్పు" మని భీమున కుపదేశించెను. భీముఁడు తలయూఁచెను.

హిడింబి పరమానందభరితయై "ముందొక సరోవరము, నొక వృక్షము గలవు. శాలిహోత్రుఁడను ముని తన తపః ప్రభావముచేత నా కొలనినీరు ద్రావినవారికి తృష్ణాక్షుధలు బాధింపన ట్లొనర్చెను. ఆ వృక్షము శీతాతపములు లేకుండ రక్షించును. అచ్చటికి కృష్ణద్వైపాయనుఁడు వచ్చి మీకు హితోపదేశ మొనర్చు"నని భవిష్యత్తు నెఱిఁగించెను. వార లందుకు సంతసించి, యచటి కేఁగి కొలనినీటిని ద్రావి, యా వృక్షముకడ నివసించుచుండిరి.

ఒకనాఁడు కృష్ణద్వైపాయనుఁడు రాఁగా నందఱును నమస్కరించి యాసనార్ఘ్యవిధుల నతనిని సత్కరించిరి. కృష్ణద్వైపాయనుఁడు హృష్టుఁడై "మీకు పురాకృత కర్మము వలన నిట్టి దుఃఖములు సంభవించుచున్నవి. చింతింపఁబనిలేదు. మీ రిచటినుండి యేకచక్రపురమున కేఁగి బ్రాహ్మణ వేషమును ధరించి బ్రాహ్మణులతోఁ గలసి మెలసి తిరుగుచుండుఁడు. నేను మఱల నక్కడఁ గనిపించెద"నని చెప్పి వెడలిపోయెను. పాండవు లేకచక్రపురమున కేఁగఁ బ్రయాణమైరి.

జడలను దాల్చి జింక చర్మములఁబూని, దర్భలు చేతఁ బట్టుకొని వేదముఁ బఠించుచు బ్రాహ్మణ వేషములతోఁ బాండవు లేకచక్రపురముఁ బ్రవేశించిరి. ఒక బ్రాహ్మణు నింట విడిసి భిక్షాటన మొనర్చుచుఁ గాలమును వెళ్ళబుచ్చుచుండిరి. ఆ పురమునకుఁ గంటకుఁడుగ నున్న బకాసురుఁడను రాక్షసుని భీముఁడు వధించెను. దానితో నూరంతటను గగ్గోలు పుట్టెను.

ఇఁక నీ పురమున నుండుటకు వీలు గాదని ద్రుపద పురంబునకుఁ బోవ నిశ్చయించుకొని పాండవులు మార్గముఁ బట్టి నడువసాగిరి. వ్యాసమహర్షి ప్రత్యక్షమై "ధర్మరాజున్నచోట ధర్మమునకు హాని కలుగదు. భూమియం దేవస్తువైనను నశించును గాని, ధర్మముమాత్రము నశించ"దని ధర్మజుని గుణగణములఁ బ్రశంసించుచు నిట్లు చెప్పెను." ఒక

మునికన్య పతిఁ బడయఁజాలక శివునిఁగూర్చి తప మాచరించెను. శివుఁడు ప్రత్యక్షమై వరమును గోరుకొమ్మనఁగా నామె 'భర్త నిమ్ము! భర్తనిమ్ము!' అనుచు నయిదుమాఱు లడిగెను. "నీ వైదుమాఱులు భర్త నర్థించితి గాన రానున్న జన్మమున నేవురు భర్తలఁబొందెద" వని శివుఁడు వర మొసఁగెను. ఆ మునికన్యకయే పాంచాలదేశాధిపతి యగు ద్రుపదునకుఁ బుత్రికయై కృష్ణ యనుపేర శుక్లపక్ష శశికళంబోలె వర్ధిల్లుచున్నది. ఆమెకు ద్రుపదుఁడు స్వయంవరము నేర్పాటు గావింపనున్నాఁడు. కాన మీ రచట కేగుఁడు. ఆమెయే మీకు భార్య యగు"నని చెప్పి యంతర్ధానము నందెను. పాండవులు ముందునకు నడువసాగిరి. మార్గమధ్యమునఁ గుబేర సఖుఁడగు నంగారపర్ణుఁడనువాఁడు వీరి నడ్డగింపఁగా నర్జునుఁడు వానిని జయించెను. పాండవులు ద్రుపదపురాభిముఖులై పోసాగిరి.

ధౌమ్యుఁ డను మహర్షిని దమ పురోహితునిగఁ బాండవులు నియమించుకొని యతనితోఁగూడ వారు ద్రుపదపురముఁ జేరిరి. ముఖముల క్షాత్రతేజము కలకల లాడుచున్నను బ్రాహ్మణవేషములు వీరి కొప్పి యుండెను. నివురుఁగప్పిన నిప్పులవలె నున్న పాండవులు తమ వీరలాంఛనములను క్షాత్రోచితాలంకరణములను దీసివైచి బ్రాహ్మణ శ్రేష్ఠులవలె సంచరించు చుండిరి.

ద్రుపదుఁడు మత్స్యయంత్రము నొకదాని నంబరతలమున వ్రేలాడఁగట్టి దానిఁ దెగవైచిన వారలకుఁ దన పుత్రిక

నొసంగుదు నని చాటించెను. స్వయంవరమునకు వచ్చిన రాకుమారు లెల్లరును మత్స్యయంత్రముఁ దెగ ్రవేయుటకుఁ బ్రయత్నించి విఫలులైరి. బ్రాహ్మణులలో నున్న యర్జునుఁడు వడివడిగ నడచి వచ్చి ధనువునెత్తి గుఱిచూచియొక్క వ్రేటున మత్స్యయంత్రముఁ దెగనేసెను. సభాధిష్ఠిత రాజవర్గ మెల్ల బ్రాహ్మణ మాత్రుఁడిట్టి వీరకృత్య మొనర్చుట తమ కవమానముగఁ దలఁచి యర్జునునితోడి యుద్ధమునకు సన్నద్ధులైరి. అర్జునుఁడు తన పరాక్రమముచే వారినుక్కడంచి ద్రుపదకన్యతోఁబాటు, విజయమును గూడ సంపాదింపఁగలిగెను. రాజులు పెడమొగములఁ బెట్టుకొని తమ తమ రాజ్యములకుఁ జనిరి.

ద్రుపదుఁడు తన కుమార్తెను బ్రాహ్మణున కీయ వలసి వచ్చెనని చింతించుచుండ వ్యాసుఁడు సందేహనివృత్తిఁ గావించి మత్స్యయంత్రముఁ దెగనేసినవాఁ డర్జునుం డని యెఱింగించెను. ద్రుపదుఁ డుత్సాహియై పాండవులను రావించి విధివిధానముగ వారికేవురకు ద్రౌపది నిచ్చి వివాహముఁ గావించెను. కొంతకాలము ద్రుపదునింటఁ బాండవు లిష్టభోగము లనుభవించి ద్రౌపది యన్న యగు ధృష్టద్యుమ్నుఁడు వెంటరాఁగా ద్రౌపదీ, కుంతీ సమేతులయి హస్తినాపురమునకు బయలుదేఱిరి.

పాండవులు చచ్చిరని భ్రమపడి యున్న దుర్యోధనునకు వారు బ్రతికి యుండుటయు, స్వయంవరమున

ద్రౌపదిని సంపాదించి వివాహమాడి యెదురుతిరిగినరాజుల నుక్కడఁగించుటయుఁ జూచుటచే మిక్కిలి భయమయ్యెను. 'తానొకటి తలఁచిన దైవ మొకటి దలఁచు' నన్న ట్లెన్ని మాయలు పన్నినను పాండవులకు బాధలు గలుగలేదు— శుభములే వారి నెదుర్కొనుచుండెను. ఏదో యొక విధ మ్మగు భేదోపాయమ్మునఁ బాండవుల వంచింప వలయునని దుర్యోధనుఁడు కర్ణాదులతో నాలోచింపసాగెను. ఈ విష యముఁ దెలిసికొని భీష్మ, ద్రోణ, విదురాదులు బుద్ధి చెప్పిరి. వారిమాటలను సరకుసేయక కౌరవులు మాయోపా యములఁ బన్నుచుండిరి.

పాండవులు ద్రౌపదితోఁ గలిసి సబాంధవముగఁ బురమును సమీపించి రను వార్త విని ధృతరాష్ట్రుఁడు వారిఁ దోడ్తెచ్చుటకుఁ ద్రోణాదులను బంపెను. అందఱుఁ గలిసి పురముఁ బ్రవేశించిరి. పౌరులెల్లరు "ధర్మముల కునికి పట్టగు ధర్మరాజు రాజ్య మొనర్పఁదగునుగాని, కష్టములకుఁ డగునే! పాండురాజువలె తమ్ములుఁ దాను రాజ్యము చేయవలయు" నని సంతోషోక్తులఁ బలుకుచుండ వారు రాచనగరిఁ జేరిరి.

ధృతరాష్ట్రుఁడు, భీష్మ ద్రోణాదులును దుర్యోధన, దుశ్శాసనాది పుత్రులును, శ్రీకృష్ణాదులును జూచుచుండ ధర్మరాజుఁ దనంతకుఁ బిలిచి "ధర్మరాజా! సర్వలోకసాక్షి యగు నీ కృష్ణుఁడుసాక్షిగ నీ యర్ధరాజ్యమును నీ కొసఁగితిని.

మీ తండ్రి సంపదలనెల్ల స్వీకరింపు'' మని చెప్పి ధర్మరాజు నర్ధరాజ్యాభిషిక్తుఁజేసి ఖాండవప్రస్థమున కేఁగి రాజ్యముఁ బాలించుకొనుఁడని పాండవులఁ బనిచెను.

పెదతండ్రి శాసనమును శిరసావహించి శ్రీకృష్ణ పురస్సరముగఁ బాండవులు ఖాండవప్రస్థముఁజేరి రాజ్య పాలన మొనర్చుచుఁ, బ్రజలకు 'రామ రాజ్యముఁ' దలఁపు నకుఁ దెచ్చుచుండిరి. విశ్వకర్మ యను శిల్పిని రావించి విశిష్టాలంకారశోభితమైన పట్టణమొకదానిని నిర్మించి యిమ్మన నతఁడట్లు చేసెను. దానికి 'ఇంద్రప్రస్థ' పురమను నామకర ణముఁ జేసి సుముహూర్తమునఁ బురప్రవేశముఁ గావించిరి. ధర్మరాజు తన తమ్ముల పరాక్రమ మూఁతగాఁగొని ప్రజలఁ గన్న బిడ్డలవలెఁ బాలింపసాగెను.

ఒకనాఁడు నారదుఁడు పాండవులకడ కేతెంచెను. పాండవులు యథావిధిగ నతనిని సత్కరించిరి. నారదుఁ డందు లకు సంతుష్టుఁడై ''మీరలు యోగ్యులు, మీరందఱు నెల్ల కాల మన్యోన్యముగ నుండఁగలరు. కాని, భార్యావిషయమగు కలహము రాకుండ కాపాడుకొనుట లెస్స. ఏవురకొకతెయే భార్య యుండుటవలనఁ గొన్ని పరిస్థితులలోఁ జిక్కు లేర్పడ వచ్చును. అందుకొఱ కొక్కొకనియొద్ద నొక్కొక సంవత్స రము ద్రౌపది యుండునటులఁ గట్టడి చేసికొనుట మంచిది. ఒకనియొద్ద ద్రౌపది యుండఁగా మఱియొకఁడే కారణమున

నైన వచ్చిన నతఁడు పండ్రెండునెలలు తీర్థయాత్రఁ జేయు నటుల నియమ ముంచుకొనుఁ''డని చెప్పి వారల నాశీర్వదించి యేఁగెను. ద్రౌపదీధర్మరాజు లాయుధశాలలో నుండుతఱి బ్రాహ్మణ గోరక్షణార్థము ధనువుఁదెచ్చుటకు నందరిగి విధిలేక నర్జునుఁ డిట్టి తప్పు చేసెను. అందువలన నతఁడు తీర్థ యాత్రకు బయలు దేఱెను.

తీర్థయాత్రా సందర్భమున ఉలూచి యను నాగకన్య కను, చిత్రాంగదను నుద్వాహమాడి యతిరూపమున ద్వారకా నగరమున కేఁగి కృష్ణునిచెల్లె లగు సుభద్రను వలచి, వలపించి వివాహితుఁడై యర్జునుఁడు సుభద్రాసమే తముగ సంవత్సరము గతింపఁగనే యింద్రప్రస్థమున కేతెంచెను.

## 6

## రాజసూయాధ్వరము

నానావిధభోగము లనుభవించుచు, ధర్మరాజు రాజ్య పాలన మొనర్చుచుండెను. కృష్ణార్జును లగ్నిదేవుని కోరికపై ఖాండవదహనమునకుఁ దోడ్పడి, మయుని గాపాడి, వాని దోడ్కొని ధర్మరాజుకడ కేతెంచిరి. కృష్ణార్జునుల ప్రతాపము ధర్మరాజు కొనియాడెను. మయుఁ డర్జునుఁ డొనర్చిన సహా యముఁ దెల్పి యా ఋణముఁ దీర్ప 'నేనొక యపూర్వసభను నిర్మించియిత్తు' నని ధర్మజునకుఁ జెప్పి యపురూపమైన యొక సభాభవనమును మహామహిమాన్వితముగాఁ గట్టి యొసఁగెను.

ధర్మరాజు బ్రాహ్మణుల కనేక దానము లిచ్చి, పాయసాన్న ములఁ బెట్టించి, పేదల నాదరించి బంధుజన పరివృతుఁడై యొక సుముహూర్తమున నా సభాభవనముఁ బ్రవేశించెను.

నారదుఁడు నూత్ననిర్మితమైన మయసభా విభవముఁ జూచెడు తలంపుతో నింద్రప్రస్థమునకేతెంచి సత్కృతుఁడై ధర్మజుని రాజనీతిఁ దెలిసికొనన నీ విధముగఁ బ్రశ్నించెను. "మీ పూర్వికుల సన్మార్గముల ననుసరించి ధర్మార్థముల కేలాటి బాధలు కలుగకుండఁ గాలవిభాగము ననుసరించి నీవు రాజకార్యములను నెఱవేర్చుచున్నావు గదా! ధర్మ మునే మనసున నిల్పి రాత్రికాలములందే రాజకార్యములఁ గూర్చి యాలోచించుచున్నావు గదా! యోగ్యులైన బ్రాహ్మణులను వంశక్రమమున వచ్చువారినే మంత్రులుగా నియమించితివి గదా! అనేక విధములగు యుద్ధములలో నారి తేఱినవారినే సేనాధ్యక్షులుగ నుంచితివిగదా! నీ ప్రధాన మంత్రి సర్వకార్యసమర్థుఁడై, శత్రురాజు లొసఁగు ధనమున కాసపడనివాఁడై, గర్వరహితుఁడై భక్తిశ్రద్ధలతో రాజ కార్యముల నిర్వహించుచుండునా? నిన్నెల్లప్పుడు నష్టాంగ విదులైన యాయుర్వేద వైద్యులు సేవించుచుందురా? చెడు నడవడికయు, లంచగొండితనమును లేనివారలనే ధనమును సంపాదించు విషయమునను, వ్యయపఱచు విషయమునను నియమించితివి గదా! భృత్యులకుఁ దగిన జీతము లిచ్చుచు,

సైనికు లెవరైన యుద్ధమున మరణించిన వారి కుటుంబము లకుఁ దగిన ధనసహాయ మొనర్చుచున్నావు గదా! చోర భయము లేకుండఁగ ధరణిఁ బాలించుచు, పేదవారైన రైతులకు ధాన్యమును విత్తనములను, వణిజులకు ధనము నప్పునిచ్చుచున్నావు గదా! మూఁగ, కుంటి, గ్రుడ్డి వారల కాహార మొసఁగు నేర్పాటు గావించి, వారలను దయతోఁ బ్రోచుచున్నావు గదా! శరణన్న శత్రువులకైన నభయ మిడి పాలించుచున్నావు గదా!" యని కొన్ని విషయములఁ బ్రశ్నింప, ధర్మరాజు "ధర్మలోపముఁ జేయక నా శక్తికొలఁది గతించిన మహాత్ముల చరిత్రములను, వారిరాజ్యపాలనమును దృష్టిలో నుంచుకొని యథావిధిగ రాజ్యపాలనము సల్పు చున్నాఁడ" నని చెప్పి నారదునకు మయ నిర్మితమైన సభా భవనమును జూపెను.

అందు నిగనిగలాడు చంద్రకాంత శిలలపైఁ బచ్చల తోడను, రత్నములతోడను పద్మములు చెక్కఁబడి యుండెను. మణులలో వైడూర్యములఁ బొదిగించి 'నగిషీ' లొనర్పఁబడియెను. కనక స్తంభములపై చిత్రలేఖనము సల్పఁ బడుటచే మయసభ నయనానందకరముగ నుండెను. నీరున్న ట్లును, తరంగము లూఁగుచున్నట్లును గనిపించును గాని, యందు నీరుండదు. స్తంభము లున్నట్లుకానవచ్చును గాని, స్తంభ మొక్కటియు నుండదు. మఱొకచోట ద్వారమున్న

దనిపించునుగాని, యది యుండదు. నీరు లేదన్నట్లున్న స్థలముల నీరును, స్తంభములు లేక విశాలముగఁ గనిపించు స్థలముల స్తంభములును, ద్వారబంధములు లేక యొకటే మందిరముగఁ గనుపించు చోట్ల ద్వారబంధము లుండి చిత్ర విచిత్రముగ నిర్మింపఁబడినట్టి యా సభాభవనముఁ జూచి నారదుఁ డాశ్చర్య చకితుఁడై యది బ్రహ్మ, మహేంద్రాదుల సభలకన్న నుత్తమోత్తమముగ నున్న దని పొగడెను.

నారదుఁడు "ధర్మరాజా! ధర్మబుద్ధిఁ జేసి రాజనీతికే మాత్రము లోపము ఘటిల్లకుండునట్లు ప్రజాపాలన మొనర్చు నీ కీ సభా భవనము తగియున్న" దని చెప్పి, మఱియు "నీవు మహాప్రభావ వంతుఁడవు. నీ తమ్ములు జగన్నుత పరాక్రమవంతులు. ఇన్నిటఁ బ్రసిద్ధుఁడవైన నీవు మహాపాతక క్షయమును, రాజులనెల్ల జయించి యశేష సంపదఁగొనుట కాధారమైనట్టిదియును, యజ్ఞములలో నెల్ల శ్రేష్ఠమైనదియు నగు రాజసూయాధ్వరముఁ గావింపు" మని ప్రోత్సహించి యాశీర్వదించి వెడలిపోయెను.

నారద వాక్యము ననుసరించి ధర్మరాజు రాజసూయక్రతువుఁ గావింపఁ గృతనిశ్చయుఁడై కృష్ణునిఁ బిలిపించి సహోదరుల సమక్షమున స్వాభిప్రాయ మెఱిఁగించెను. వారెల్లరు నా కార్య మొనర్చుట కుత్సాహమును బ్రకటించిరి.

అర్జునుఁ డుత్తరదిశకు వెళ్ళి రాజులనందఱిని జయించి యుత్తరదిగ్విజయముఁ గావించెను. భీముఁడు పూర్వదిశ

కును, సహదేవుఁడు దక్షిణదిశకును, నకులుఁడు పశ్చిమ దిశ కును వెళ్ళి యా యా దిక్కులందుఁ గల రాజుల నోడించి వారిని సామంతులనుగాఁ జేసికొని వారొసఁగు కప్పములను, బహుమానములుగ నిచ్చు ధనధాన్య సంపత్తులను గొని తెచ్చిరి.

కృష్ణ, ధౌమ్య, ద్వైపాయనాదుల యనుమతితో ధర్మరాజు రాజసూయయాగముఁ జేయ సమకట్టి యా జన్నమునకు వచ్చు రాజులకును, బ్రాహ్మణులకును వేఱువేఱుగ విడుదు లేర్పఱచెను. ఆ యాగముఁ జూడ వచ్చెడి యశేష ప్రజ కనేక భోజనశాలలు వెట్టించెను. ఋత్విగ్వరులను సత్కరించుటకుఁ దగిన సన్నాహములు చేసెను.

భూమికి నాలుగుచెఱఁగులఁ గల రాజవర్గ మా యాగమునకు విచ్చేసెను. వేదాధ్యయన సంపన్నులగు బ్రాహ్మణోత్తము లరుగుదెంచిరి. 'నేల యీనిన విధాన' గుంపులు గుంపులుగఁ బ్రజలు వచ్చుచుండిరి. ఎవరి నెట్లు సత్కరింపఁ దగునో వారి నట్లు సత్కరించుట కేర్పాట్లు గావింపఁబడి యుండెను. భీష్మ, ద్రోణ, ధృతరాష్ట్ర, కృపాదులును, దుర్యోధన, కర్ణ, శకుని, శల్యాదులును సకళత్రముగ, సబాంధవముగ, మిత్ర పురస్సరముగ నేఁగుదెంచిరి. వారి నందఱను ధర్మరాజు సత్కరించి "మీదయవలన నిట్టి ఘన కార్యమునకుఁ దలపెట్టితిని. మీ రెల్లరుఁ దోడ్పడి యీ యాగము నిర్విఘ్నముగ జరుపవలయు" నని సవినయముగఁ బ్రార్థించెను.

కును, సహదేవుఁడు దక్షిణదిశకును, నకులుఁడు పశ్చిమ దిశ కును వెళ్ళి యా యా దిక్కులందుఁ గల రాజుల నోడించి వారిని సామంతులనుగాఁ జేసికొని వారొసఁగు కప్పములను, బహుమానములుగ నిచ్చు ధనధాన్య సంపత్తులను గొని తెచ్చిరి.

కృష్ణ, ధౌమ్య, ద్వైపాయనాదుల యనుమతితో ధర్మరాజు రాజసూయయాగముఁ జేయ సమకట్టి యా జన్నమునకు వచ్చు రాజులకును, బ్రాహ్మణులకును వేఱువేఱుగ విడుదు లేర్పఱచెను. ఆ యాగముఁ జూడ వచ్చెడి యశేష ప్రజ కనేక భోజనశాలలు పెట్టించెను. ఋత్విగ్వరులను సత్కరించుటకుఁ దగిన సన్నాహములు చేసెను.

భూమికి నాలుగు చెఱఁగులఁ గల రాజవర్గ మా యాగమునకు విచ్చేసెను. వేదాధ్యయన సంపన్నులగు బ్రాహ్మణోత్తము లరుగుదెంచిరి. 'నేల యీనిన విధాన' గుంపులు గుంపులుగఁ బ్రజలు వచ్చుచుండిరి. ఎవరి నెట్లు సత్కరింపఁదగునో వారి నట్లు సత్కరించుట కేర్పాట్లు గావింపఁబడి యుండెను. భీష్మ, ద్రోణ, ధృతరాష్ట్ర, కృపాదులును, దుర్యోధన, కర్ణ, శకుని, శల్యాదులును సకళత్రముగ, సబాంధవముగ, మిత్ర పురస్సరముగ నేఁగుదెంచిరి. వారి నందఱను ధర్మరాజు సత్కరించి "మీదయవలన నిట్టి ఘన కార్యమునకుఁ దలపెట్టితిని. మీ రెల్లరుఁ దోడ్పడి యీ యాగము నిర్విఘ్నముగ జరుపవలయు" నని సవినయముగఁ బ్రార్థించెను.

మిమ్ముఁ దోడ్కొని రమ్మనియె' నని విదురుఁ డాడిన మాటలకు ధర్మరాజు "జూద మనునది దుర్వ్యసనము. అంత పెద్ద సభలో జూదమాడవలయు ననుచున్నాఁడవు. ఇది తగునా? అయినను ధృతరాష్ట్రునిమాట మీఱుటకు వీలులేదు. కాన వచ్చెద"నని చెప్పి ద్రౌపదితోడను, తమ్ముల తోడను ప్రయాణమై హస్తినాపురమునకు వెళ్లెను.

ఒకనాఁడు సభామంటపమున నందఱును గూర్చుండి యుండ దుర్యోధనుఁడు ధర్మరాజుతో "ఆర్యా! నీవు జూదము నందుఁ బ్రీతి కలవాఁడవు, దక్షుఁడవు నని విన్నాఁడను. ప్రొద్దు పోవుటకొఱకు జూడుదము ర"మ్మనియెను. ఆ మాటలకు ధర్మ రాజు "నాయనా! రాజధర్మమునకు జూదము తగినది కాదు. పాపముతో నిండిన జూదము మనబోంట్లకుఁ దగదు. వంచకులతోడను, కుత్సితులతోడను జూదమాడిన ధనముతోఁ బాటు ధర్మము కూడఁ జెడును. మాయాద్యూతమున జయించుట మహాపాతకం"బని సభాసదులెల్లరు వినుచుండఁ బల్కెను. శకుని "జూదమున నేర్పరి యగువాఁడు లోక జ్ఞానము గలవాఁడును, బుద్ధిమంతుఁడును, క్షత్రియనీతి నెఱిఁగినవాఁడు నయి యుండుఁగావున నిందింపఁదగ"దని చెప్పి 'నీ చేతనైన జూదమాడ ర'మ్మని ధర్మరాజునకుఁ బౌరుషము గలుగునట్లు రెచ్చఁగొట్టెను. జూదముకొఱకే పిలువఁబడిన వాఁడు కావునను, జూదమన్న మహాప్రియము కావునను ధర్మ రాజందుల కియ్యకొనియెను.

ఆ సభలోనున్నవారి నందఱఁ గలయఁజూచి ధర్మరాజు "వీరిలో నాతో జూడమాడువా రెవ్వ"రని ప్రశ్నించెను. దుర్యోధనుఁడు "మా మాతులుఁడగు శకుని నాకు మాఱుగ జూదమాడును. అతఁడు పణముగ నొడ్డిన ధనరాశులెల్ల నే నొసంగెద" నని చెప్పెను. భీష్మద్రోణాదులు చూచుచుండఁగ ధర్మరాజు శకునితో జూదమునకుఁ గడంగెను. శకుని మాయ లెఱిఁగినవాఁడై నందున పాచికలను దన కిష్టము వచ్చినట్లు వైచుచు మొట్టమొదట ధర్మరాజు నోడించెను. పిదప మఱల ధర్మరాజు జూదమునకుఁ గడఁగెను.

మాటికి మాటికిఁ బందెము లొడ్డుచు ధర్మజుఁడు సువర్ణ భాండాగారములను, వజ్రవైడూర్య ధనభాండాగారములను, గజతురగములను, దాసదాసీజనంబులను క్రమక్రమముగ నోడిపోయెను; తన తమ్ముల నొక్కొక్కని నొక్కొక్క పందెమున నోడెను. తుదకు ధర్మరాజు పందెమున కేమియు లేక చింతించుచుండ శకుని "ద్రౌపదిని పందెముగ నొడ్డు" మని జ్ఞప్తి చేయఁగా నతండు ద్రౌపదిని గూడ పణముగఁ బెట్టి జూదమాడి యోటువడెను. కడకు నిర్ధనుఁడై, దీనుఁడై యున్న ధర్మరాజుఁ గాంచి భీష్మ, ద్రోణాదులు వ్యాకులపడ సాగిరి. విదురుఁడు దుఃఖించుచుండెను. సభాసదులుఁ గన్నీరు కార్పఁదొడఁగిరి. దుర్యోధన, దుశ్శాసన, కర్ణాదులు సంతోషింపసాగిరి.

అంత దుర్యోధనుఁడు విజయదర్పమునఁ బ్రాతిగామి యనువానిం బిలిచి ద్రౌపదిని దోడ్కొని రమ్మని పనిచెను.

వాఁడు ద్రౌపదికడకుఁ బోయి "పాండవపట్టమహిషీ! ధర్మ రాజు జూదమున ని న్నోడిపోయెను. నీవు దుర్యోధనునిదాన వైతివి గావున సభకుఁ దోడ్కొని రమ్మని నన్నతఁడు పంపె" నని చెప్పెను. ద్రౌపది వాని మాటలకు సంభ్రమమంది "ఆర్యా! ధర్మరాజు తా నోడి నన్నోడెనా? నన్నోడి తానోడెనా?" యని ప్రశ్నించెను. ప్రాతిగామి ప్రత్యుత్తర మీఁజాలక సభకు వచ్చి దుర్యోధను నడిగెను. దుర్యోధనుఁడు మండిపడుచు "సందేహమును సభలో వచ్చి యడిగి నివృత్తిఁ జేసికొన వచ్చు"నని చెప్పి యామెం దెచ్చుటకు దుశ్శాసనుని బంపెను. దుశ్శాసనుఁడు పోయి ద్రౌపది తలవెంట్రుకలఁ బట్టుకొని సభ కీడ్చుకొని వచ్చెను. పాండవు లామె యవస్థఁ జూడఁజాలక తలలు వాల్చుకొని దుఃఖింపసాగిరి. దుర్యోధనుని దుష్ప్రవర్తనమును సభలోని పెద్దలు తూలనాడిరి. కర్ణాదులు సంతోషముతో విఱ్ఱవీఁగుచుండిరి.

అప్పుడు వికర్ణుఁ డనువాఁడు లేచి యీ దుర్ణయమును సహింపనోపక "సభాసదులారా! జూదము, వేఁట, సురా పానము, బహుభక్షణాసక్తి యను నాలుగు దుర్వ్యసన ములలో మనుష్యులు ధర్మము దప్పి వర్తిల్లుదురు గావున వారు చేయు పనులను లక్ష్యపెట్టఁగూడ దందురు. ఆ విధము గనే ధర్మరాజు ద్యూతాసక్తుఁడై యుండుటచే నతఁడు పాండవు లందఱకు భార్యయైన ద్రౌపదిని పణముగా నొడ్డుటకు వీలు లేదు. అట్టి సందర్భమున రజస్వల యగుట నేకవస్త్ర ధారిణియై యున్న ద్రౌపదిని సభకు బలాత్కారముగఁ గొని

వచ్చుట యధర్మ మని నా యభిప్రాయము'' అని చెప్పెను. వికర్ణునిమాటలకుఁ గర్ణుఁ డెగిరి పడి "ద్రౌపదిని వివస్త్రగాఁ దెచ్చినను దప్పు లేదు. ఆమె యోటుపడినమాట నిజ''మని వాదించెను. పాండవులను వస్త్రములు విడిచి యుండని దుర్యోధనుఁ డడుగఁగా జూదమున పరాజితులైనవా రగు టచే వారు బదులు చెప్పక తమ తమ వస్త్రముల నొసఁగిరి.

ద్రౌపది యటు నిటుఁ జూచుచుండ దుశ్శాసనుఁ డసభ్యముగఁ బ్రవర్తించి యామె పైఁటచెఱఁగు చేతఁబట్టు కొని చీరను లాగసాగెను. ద్రౌపది తన మానసంరక్షణార్థము శ్రీకృష్ణునిఁ బ్రార్థింప నతఁడు దయాంతఃకరణుఁ డగుట నామె కోర్కెను మన్నించి యక్షయముగఁ జీర లొసఁగసాగెను. ఒక రాశి వస్త్రములు పడియెను. తా నెంతగా లాగినను వస్త్రము లెడతెగక వచ్చుచుండుటచే లజ్జావనతవదనుఁడై దుశ్శాసనుఁడు సభలోఁ గూలఁబడెను.

ద్రౌపదికి జరిగిన యవమానమును భీముఁడు సహించలేకపోయెను. మనస్సులోని క్రోధాగ్నిజ్వాలలు పెల్లు బుకుటవలన నతని నేత్రము లెఱ్ఱఁబాఱెను. పండ్లు పటపటఁ గొఱుకుచు 'సభాసదులు చూచుచుండ మదోద్ధతితో ద్రౌపదిని ట్లవమానపఱచిన దుశ్శాసనుని యుద్ధములో గుండెలుచీల్చి రక్తముఁ ద్రావెద'' నని ప్రతిజ్ఞఁ గావించెను. సభాసదులు విహ్వాలులైరి. అంతటితోఁ బోనీక దురహంకారుఁడైన దుర్యోధనుఁడు తొడఁదట్టుచు ద్రౌపదిని వచ్చి కూర్చుండు మనియెను. భీముఁడు ద్రేఁటువడ్డ భుజంగంబువోలె నెగిరిపడి.

కన్ను లుఱిమి "ద్రౌపదిని తొడమీఁదఁ గూర్చుండుమని యన్న దుర్యోధనుని తొడలు రణరంగమున విఱుఁగఁగొట్టెద" నని ప్రతిజ్ఞాపూర్వకముగఁ బలికి గదవైపునకు దృష్టులు సారించిన భీముని భీష్మద్రోణాదు 'లది కోపంబునకు సమయ ముగా' దని వారించిరి.

అంత ధృతరాష్ట్రునింట ననేకాశుభ సూచనలు గలిగెను. ఆ మహోత్పాతంబులఁ గనిన భీష్మ, విదురాదులు కౌరవుల కరిష్టములు సంభవింపఁగలవని తలఁచిరి.

ధృతరాష్ట్రుఁడు పిదప ద్రౌపదిఁ బిలిపించి వరములఁ గోరుకొను మనఁగా నామె "ధర్మరాజు దాస్య మనుభవింప కుండునట్లు వర మొసఁగు' మని ప్రార్థించెను. అతఁ డా వర మొసఁగి మఱియొక వర మడుగు మనియెను. "ధర్మజుని నలువురు తమ్ములకును దాస్యము లేకుండఁ గరుణింపు"మన నట్లుఁ గావించి తన కొడుకులు గావించిన పరాభవమునకు శాంతింపు మని ద్రౌపది నూరార్చి ధర్మరాజాదుల నటకు రావించి "ద్రౌపదివలన మీ రాజ్యము మీకు లభించినది. మీర లింద్ర ప్రస్థమున కేఁగి సుఖింపుఁ" డని ధృతరాష్ట్రుఁడు చెప్పెను. భీముఁడు స్త్రీపూర్వకముగ వచ్చిన రాజ్యమున కిచ్చగింపక నలుకతోఁ గంక్షెఱ్ఱఁజేసి "శత్రువులను సమరమందు జయించి రాజ్యమును సంపాదింపవలయునే గాని, స్త్రీమూలముగ మనము రాజ్యముఁ బొంద నక్కఱలే"దని ధర్మరాజుతోఁ జెప్పెను. ధర్మరాజు భీము నోడంబఱచి ధృతరాష్ట్రాదులకు

నమస్కరించి యనుజ్ఞాతుఁడై సోదర, సతీసమేతముగ నింద్ర ప్రస్థముఁ జేరుకొనియెను.

దుర్యోధనుఁడు తన తండ్రివలనఁ బాండవులు రాజ్యముఁగొన్నందుకుఁ గలఁతపడి, తండ్రిపాలికిఁ జని "వారు సుఖముగ నున్నంతకాలము నాకు మనశ్శాంతి కలుగ" దని వాపోయి మఱల జూదమునకు ధర్మరాజుఁ బిలువనంపునట్లాతని నొడంబఱచెను.

ప్రాతిగామి యింద్రప్రస్థమున కేఁగి ధర్మరాజుతో ధృతరాష్ట్రుఁడు చెప్పిన మాటలం జెప్పి వారలఁ దోడ్కొని హస్తినాపురమునకు వచ్చి చేరెను.

ఈ మారు జూదమున నోడినవారు పండ్రెండేం డ్లరణ్యవాసమును, పదుమూఁడగు నేడజ్ఞాతవాసమును జేయవలయు. అజ్ఞాతవాససమయమున బయలుపడిరేని మఱల నరణ్యాజ్ఞాతవాసములఁ జేయవలయు నని పందెము పెట్టుకొని ద్యూతమున కుపక్రమించిరి. శకునితోడి జూదమున మఱల ధర్మరాజోడిపోయెను.

రాజ్యమును, సకలైశ్వర్యములను వదలి పాండవులు ద్రౌపదీసహితులై, పెద్దలకు నమస్కరించి, వారి యాశీస్సులఁ బడసి దైవనియోగంబునం జేసి యరణ్యమార్గములఁబడి పోయిరి.

# 8

## (i) పాండవుల వనవాసము

తమ తమ యాయుధములు ధరించి పాండవులు ద్రౌపదితోఁగూడి యుత్తరదిశకుఁ జనిరి. పౌరులెల్లరు వారి కష్టదశకుఁ గన్నీరుఁ గార్చిరి. బ్రాహ్మణులు తమ్మనుసరించి వచ్చుటఁగాంచి ధర్మరాజు "పూజ్యులారా! సర్వముఁ గోలుపోయి సతీసమేతముగ నరణ్యావాసమునకుఁ బోవుచున్న మా వెంట వచ్చి కందమూలఫలాదులఁ దినఁ బూనుకొను టేల? మరలి పొం"డని వారలఁ బ్రార్థించెను. బ్రాహ్మణులు ధర్మరాజాభిమతం బెఱిఁగినవారై "కౌంతేయాగ్రణీ! నీ మనస్సులోని వ్యథను మే మెఱుఁగకపోలేదు. పాపకర్ముఁడు, నధర్మయుక్తుఁడు నగు నా దుర్యోధనుని రాజ్యమున నుండము. ధర్మనిరతుఁడవును, న్యాయబద్ధుఁడవు నగు నీవెంటనే యుండి మా కవసరమైన వన్యాహారములను మేమే తెచ్చుకొనుచు మీ వెంట నుందు"మని బ్రాహ్మణు లెల్లరుఁ బాండవుల ననుసరించి పోవుచుండిరి.

"ఇష్టమృష్టాన్నముల సంతృప్తులగు బ్రాహ్మణు లిట్లు శాకములతో నుండుటఁ జూడనోప" నని ధర్మరాజు శోకించి మూర్ఛంబడఁగా శౌనకుఁ డను ఋషి "బంధుమిత్రధనములపై విజ్ఞానవంతునకు స్నేహము పనికిరాదు. తామరపాకుపై జలబిందువువలె వీనికన్నిఁటికి నంటి యుండనట్లు చరించుటయే మానవుని విశేష"మని వేదాంతమును బోధించి ధర్మరాజును

నిరస్తశోకునిగ నొనర్చెను. కాని, ధర్మరాజు నా చింతయే మిగుల బాధింపసాగెను. తన పురోహితుఁడగు ధౌమ్యుని 'ఈగండము గడచుట కేదైన నుపాయ మాలోచింపుఁ' డని యతఁడు ప్రార్థించెను. ధౌమ్యుఁడు "పూర్వము కార్తవీర్య, నహుషాదులు సూర్యుని భజించి యన్నమును బడసిరి. నీవును సూర్యుని భజింపు" మని హితోపదేశము గావించెను.

ధర్మరాజు కృతాచమనుఁడై సూర్యప్రతిమను పుష్ప, ధూప, దీపాదులఁ బూజించి వాయుభక్షకుఁడై, ప్రాణాయామములోఁగూడి సుదీర్ఘముగ సూర్యజప మొనర్ప నారంభించెను. శరీరము శీతాతపముల కలవాటుపడెను. అది నానాఁటికిఁ గృశించుచుండెను. సూర్యుఁడు ప్రత్యక్షమై "నీ తపమునకు మెచ్చితిని. వంటయింట నుంచిన వన్యమూల ఫలములు ద్రౌపదిచేత సాధితములై యక్షయముగ చతుర్విధపాకములగు" నని వర మొసఁగి యంతర్ధాన మందెను.

తన వెంట నున్న బ్రాహ్మణుల యాహారముకొఱ కింత కఠినముగఁ దప మొనర్చి ధర్మరాజు జనుల ప్రశంసకుఁ బాత్రుఁ డయ్యెను. నాటినుండి యెడతెఱపి లేక వచ్చెడు నతిథుల నిష్టమృష్టాన్నముల సంతృప్తులఁ గావించుచు ధర్మరాజరణ్యావాసము సల్పుచుండెను.

పాండవులు కామ్యకవనముఁ జేరి యటఁ గొంతకాలముండి ద్వైతవనమునకు వచ్చి చేరిరి. అట నొకనాఁడు ద్రౌపది ధర్మజునితో "మీ క్షమాగుణమే మన కిన్ని బాధలఁ గలిగించుచున్నది. అన్యాయవర్తనుఁడగు ధృతరాష్ట్రునిపై

మీ కభిమానమేల ? అనుదినమును పదివేల బ్రాహ్మణులకు కనకపాత్రముల భోజనములు పెట్టి వారి భుక్తశేషముఁ దినుచుండెడు మన కిట్టి కష్టకాలము వచ్చినదిగదా!'' అని చెప్పి వగచెను. దానికి ధర్మరాజు ''ప్రపంచమున సిరిసంపదలు శాశ్వతములు గావు. క్షమయును, ధర్మమును మానవున కుండవలసిన ముఖ్యగుణములు. మన శక్తికొలఁది న్యాయపథముననే సంచరింతము. ధృతరాష్ట్రుఁడు పరభిమాని గావచ్చును. ఆయనను మన మెపుడును ద్వేషింపరాదు. ధర్మమే మనకుఁ గావలసినయది. ఆ ధర్మముకొఱకై బ్రతుకుదము. ధర్మమునకై యవసరమైనఁ బ్రాణముల నైన నొసఁగుదుము. అదియే శాశ్వతము'' అని వాదించి ద్రౌపది నొప్పించెను.

పై సంభాషణను వినుచున్న భీముఁడు ధర్మరాజుకడకు వచ్చి ''పితృపితామహ సంపాదితమైనదై మన యర్జునునిచే సంరక్షింపఁబడుచు నా యింద్రాదులకును హరింప నసాధ్యమగు రాజ్యలక్ష్మిని కౌరవులకు ధారవోసి మహారణ్యములఁ దిరుగుట తగునా ? సింహమునోటికడ నున్న మాంసమును నక్క చేకొన్నట్లు మన సమస్తరాజ్యసంపదను గొని దుర్యోధనుఁ డెట్లు విఱ్ఱవీఁగుచున్నాఁడో గదా!'' అని నిట్టూర్పు విడిచెను. ధర్మరాజు సమాధానముగ ''నే నావిధమగు మాయాద్యూతమును నాఁ డంగీకరింపకున్న మన కీ దురవస్థలు గలుగకుండెడివి. మనము బలవంతులమై వారిని జయింపఁగలిగి నప్పటికిని అధర్మ భయమునకుఁ దల యొగ్గి యుండవలసి వచ్చెను. మన రాజ్యమే కాదు. స్వర్గాధిపత్యము నంతటిని

నాకు ధారపోయుదు నన్నను ధర్మమును విడువను. కావున ధర్మరక్షణ కొఱకు మన మీ కష్టముల ననుభవింపక తప్పదు. ఈ కష్టములు శాశ్వతములు గావు. ధైర్యముతో నుండు'' మని యతనికి బోధించెను.

ధర్మరా జొకనాఁ డేకాంతమునఁ గూర్చుండి ''భీష్ముఁడును, ద్రోణుఁడును, కృపాశ్వత్థామలు మహావీరులు; దుర్యోధన, కర్ణాదిశూరులును శత్రుపక్షమునఁ గలరు. ఇందఱను జయించి రాజ్యముఁ గొనుట కష్టతర''మని యాలోచించుచుండఁ గృష్ణద్వైపాయనుఁడు వచ్చి ''నీ వేమియుఁ జింతింప నవసరము లేదు. అధిక రహస్యమైన 'ప్రతిస్మృతి' యను విద్య నొకదానిఁ జెప్పెదను. దీని నర్జునునకుఁ జెప్పుము. అతఁ డీ మంత్రశక్తివలన నధిక తపముఁ జేసి యింద్ర, యమ, వరుణ, కుబేరాది దేవతల, నీశ్వరుని మెప్పించి మహాస్త్రములను సంపాదించుకొని యుద్ధమునఁ గౌరవక్షయ మొనర్పఁగలం''డని చెప్పి నిజేచ్ఛం జనియె.

తన చింత లెల్ల నశించెనని పరమానందమును బొంది ధర్మరాజు ద్వైతవనమును విడిచి కొన్ని యడవులను గడచి సరస్వతీతీరమున నివాస మేర్పఱచుకొని యొకనాఁ డర్జునునకు 'ప్రతిస్మృతి' విద్య నుపదేశించెను. అతఁడు 'ప్రతిస్మృతి' విద్యను సాధింప నింద్రకీలాచలమున కేఁగి నియమముతోఁ దప మాచరించి పాశుపతాస్త్ర మను నద్భుతాస్త్రము

నీశ్వరునివలన సంపాదించి యింద్ర, వరుణ, వాయు, కుబేరాదులవలన ననేకాస్త్రములఁ బడసి, మహేంద్రు నర్ధ సింహాసన మధిరోహించి వచ్చెను.

## (ii) పుణ్యకథాశ్రవణము

ధర్మరాజు బృహదశ్వుఁడను మహామునివలన నల దమయంతీ చరిత్రమును విని నలుఁడు పడిన కష్టములతోఁ దన కష్టములఁ బోల్చుకొని 'యిది యొక కష్టము గా'దని మనస్సునకుఁ ధైర్యము తెచ్చుకొని కాలముఁ గడుపుచుండెను. ఒకనాఁడు నారదుం డరుదేఱ నాతనిని సత్కరించి భూప్రదక్షిణము గావించువారలకు లభ్యములగు పుణ్యములఁ దెలిసికొని సంతుష్టుఁ డయ్యెను. తన్ను జూడవచ్చిన ఋషులతోఁ బుణ్యగోష్ఠి సల్పుచు, ధర్మరా జనేక చరిత్రములను వినుచు, ధర్మవిశేషము లెఱుఁగుచుఁ గొంతకాల మటనుండి గంధమాదన పర్వతమునకుఁ జని యతిథిసేవలఁ గావించుచుండెను.

భీముఁ డొకనాఁ డడవిలోనికిఁ జని యేవేళకు రాకుంటచే ద్రౌపదీ సంరక్షణార్థముగా నర్జున, నకుల, సహదేవుల నునిచి బ్రాహ్మణులు తోడురాఁగా ధర్మరా జరణ్యమెల్ల వెదుకఁ జొచ్చెను. ఒక యజగరముచేఁ జుట్టఁబడి భీముఁడు లావుదక్కి యతిప్రయాస ననుభవించుచుండఁ గని

యజగరముచెంత కేఁగి ధర్మరాజు పలుకుల భయసందేహ ములు తలఁకొత్త "ఓ యజగరమా! నేను పాండురాజు జ్యేష్ఠ పుత్రుఁడను. నా పేరు ధర్మరాజు. నీచే నిర్బంధింపఁ బడినవాఁడు నా తమ్ముఁడగు భీమసేనుఁడు. బుభుక్షా పీడితుఁడవై యతనిని బంధించియున్న నీకుఁ గావలసినంత మృగమాంసము నొసఁగెదను; వీనిని విడువు"మని ప్రాథేయపడి యెను. అజగరము మానవస్వనముతో "ధర్మరాజా! నేను మీ వంశపు పూర్వికుఁడను. నా పేరు నహుషుఁడు. దురహంకారుఁడనై వేయిమంది బ్రాహ్మణులను రథమునకుఁ గట్టి పరిభవించిన నన్నగస్త్యుఁడు కోపించి 'యజగరమవు క'మ్మని శాప మిడియెను. శాపనివృత్తికై నేఁ బ్రార్థింప నతఁ డనుగ్రహించి 'నీ వడుగు ప్రశ్నలకు సమాధాన మెవఁడైన నిచ్చిన శాపమోక్షం బగు'నని చెప్పెను. అందు వలన నీ తమ్ముని రక్షింపఁ దలఁతువేని నే నడిగిన ప్రశ్నలకుఁ బ్రత్యుత్తర మొసఁగి యతనిని రక్షించుకొను'మని చెప్పెను. ఆ మాటల కాశ్చర్యపడి ధర్మరాజు "మహాత్మా! మీబోంట్లడుగు ప్రశ్నములకు సమాధాన మిచ్చు యోగ్యత నా కెక్కడిది? అందుకు పండితులే యర్హులు. అయినను బ్రయత్నింతు"నని సమాధానము లిచ్చుటకు సిద్ధపడియెను.

నహుషుఁడు:—ఏ గుణములు గలవాఁడు బ్రాహ్మ ణుఁడు? అతఁ డెఱుఁగఁ దగినదెద్ది?

ధర్మరాజు :—సత్యము, క్షమ, దమము, శౌచము, దయ, తపోదానశీలములు నెవనియం దుండిన వాఁడు బ్రాహ్మణుఁడని యెఱుఁగఁదగును. సుఖదుఃఖములకు విమోహితుఁడు గాకుండుటయే యతఁ డెఱుఁగఁదగినది.

నహుషుఁడు :—ఇతరుల కప్రియములఁ గావించుచు, నసత్యమాడుచు హింసఁ గావింపనివాఁడు సుగతికిఁ బోవునంద్రు; అందులోఁగల విశేషముఁ దెలుపుము.

ధర్మరాజు :—దానము, ప్రియంబు నొనరించుట, సత్యము, అహింస యను నీ నాలుగును సమానములు. కాని వీనిలో నన్నిఁట నహింసయే శ్రేష్ఠము. దేవమనుష్య తిర్యగ్యోనులను మూఁడు గతులయందును దానాదిగుణంబులు గలిగి, యహింసాపరుఁ డైనవాఁడు దేవగతిఁ బడయును. హింసాకారకులైన మానవులు తిర్యగ్యోను లగుదురు.

తా నడిగిన ప్రశ్నల కన్నిఁటికిని చక్కని సమాధానము లొసఁగుటచే నహుషుఁడు తృప్తిఁబొంది భీముని వదలిపెట్టి తన పూర్వరూపమును ధరించి ధర్మరాజున కనేక ధర్మబోధలఁ గావించి వెడలిపోయెను. ధర్మరాజు భీమపురస్సరముగ తమ్ములచెంత కేతెంచెను.

మార్కండేయుఁ డను మహర్షి వలన ధర్మరాజు ప్రతిదిన మెన్నియో పుణ్య కథలను వినుచు 'త్వరలో రానున్న

'కలియుగముయొక్క ధర్మములఁగూర్చి చెప్పు'మనఁగా నతఁడు "'కలియుగమున సత్యధర్మములకుఁ స్థానముండదు. జనులు హింసాద్వేషములతో నుండెదరు. వర్ణాశ్రమ ధర్మములు నశించును. రాజులు ప్రజలను బాధింతురు. సస్యములు పెరుగవు. సకాలమునకు మేఘములు వర్షింపవు' అని పూసగ్రుచ్చినట్లు కలిధర్మములఁ దెలియపఱచెను. ఇఁక నెన్నియో యపూర్వ విషయముల ధర్మరాజునకుఁ దెలిపి మార్కండేయ మహర్షి వెడలిపోయెను.

## (iii) ధర్మజుని దయాగుణము

పాండవుల నరణ్యమునకుఁ దఱుముటతో దుర్యోధనుండు తృప్తిపొందలేదు. అచ్చటఁ గూడ వారికిఁ గష్టములను గల్గింపఁ దన శక్తికొలఁది ప్రయత్నించుచునే యుండెను. ఒకసారి యతఁడు పాండవుల నవమానించు సంకల్పముతో 'ఘోషయాత్ర' యను నెపముగ వారు నివసించు తావునకే మహా వైభవముతో, లెక్కలేని పరివారముతోను, సైన్యముతోను బయలుదేరి పోయెను. అచటఁ బటకుటీరములను నిర్మించు విషయమునఁ జిత్రసేనుఁడను గంధర్వునితోఁ బోరు సంభవించెను. ఇరుపక్షములకును గొంతసేపు ఘోరయుద్ధము జరిగెను. గొప్ప పరాక్రమవంతుఁడగు చిత్రసేనుఁడు కర్ణ దుర్యోధనులతో యుద్ధమునకుఁ దలపడి కర్ణుని

పాఱఁద్రోలి, దుర్యోధనునిఁ దన రథమునకుఁ గట్టుకొని యంబర తలమునఁ బోవుచుండెను. రాజరాజు వెంట వచ్చిన కౌరవు లా పరిసర ప్రాంతముల నున్న ధర్మరాజాదుల కడ కేతెంచి దుర్యోధనుని పరాభవ వృత్తాంతముఁ దెలియపఱచఁగా విని భీముఁడు సంతుష్టుఁడై పకపక నగుచు "గంధర్వుఁడు మంచి పని చేసెను. మన కిఁక దుర్యోధనుని జయించు కష్టము తప్పినది, వీని విషయమున మీరేమియు దయఁ జూపవల"దని ధర్మరాజుతో ననియెను. ఆ మాటలకుఁ గనిసి యజాతశత్రుఁడు "భీమసేనా! నీ విట్టి మాట లాడఁ దగదు. శరణన్నవారిఁ గాచుటే రాజుల ముఖ్య కర్తవ్యము. అదియుఁ గాక దాయా దులమైన మన మొండొరులతోఁ గలహించుకొనవచ్చును. మనలో నెవరినైన నితరులు పరిభవించుచున్నప్పుడు సహింప రాదు. కాఁబట్టి యెంతటి శత్రువైనఁ గానిమ్ము; దుర్యోధనుని మన మిపుడు విడిపించియే తీరవలయును. మీరలు వెళ్లి తక్షణమే గంధర్వుని గర్వమడఁచి దుర్యోధనుఁ గొనితెం"డని తమ్ము లకుఁ బౌరుషము వోసి పంపించెను. వారు తమ తమ యాయుధములతో వెడలి చిత్రసేనునితో యుద్ధముచేసి యతనిని పరాజితుఁ గావించి దుర్యోధనుని కట్లు విడిపించుకొని ధర్మరాజుచెంత కతనిఁ దీసికొని వచ్చిరి. యుధిష్ఠిరుఁడు దుర్యో ధనుని మందలించి బుద్ధిచెప్పి పంపెను. తన సైన్యముతో దుర్యోధనుఁడు కొంతదూర మేఁగి తనకు జరిగిన యవమాన మునకు మిగుల వాపోయెను.

మఱి యొకప్పుడు సాళ్వకన్యను వివాహమాడఁ బాండవు లున్న వనమార్గముననే చనుచుండి సైంధవుఁడు ద్వారముకడ నిలువఁబడి యున్న ద్రౌపదిఁ జూచి యామె నవమానింపఁ దలఁచి ధర్మరాజాదులు లేని సమయమున నామెను చెఱఁబట్టి రథమున నిడికొని పోవుచుండెను. ఈ వృత్తాంతమును దాసీ ముఖమునఁ బాండవులు విని వానిపై దండెత్తి పోయిరి. వా రతని సైన్యము నంతటిని జెల్లాచెదరు గావించి సైంధవుని బంధించిరి. భీముఁడు సైంధవుని జుట్టు పట్టుకొని కత్తితో నైదు శిఖలుగఁ గొఱిగి యవమానపఱచి ధర్మరాజు చెంతకుఁ గొని తెచ్చెను. వానిం జూచి ధర్మరాజు "ప్రపంచమున నెట్టి నీచుఁడైన నిట్టి పాపము సేయ సమకట్టునా? అల్పుఁడవును, ధృతిలేనివాఁడవు నగు నిన్నేమందును? ఇఁక నెన్నఁటికి నిట్టి కొఱగాములు సేయక బుద్ధిమంతుఁడవై యుండు" మని సైంధవునికి బుద్ధిచెప్పి యతనిని విడిపించి పంపెను.

ఒకప్పుడు మార్కండేయ మహర్షి యచటికి వచ్చెను. ధర్మరాజు శ్రద్ధాళుఁడై యతనివలన రామాయణమును చెప్పించుకొని విని సీతాదేవి కష్టములకుఁ గన్నీరుఁ గార్చి, సాక్షాద్భగవత్స్వరూపుఁ డగు శ్రీరామచంద్రుఁడే యరణ్య వాస కష్టముల ననుభవించినప్పుడు, తానిట్టి కష్టముల ననుభ వించుటలో విశేషము లేదని తలఁచెను. సావిత్రీ చరిత్రము నాకర్ణించి 'మహాపతివ్రతా శిరోమణి' యని యామెను పొగడి యానందించెను.

ఒక బ్రాహ్మణుని యరణిని మృగ మపహరించి కొని పోఁగాఁ బాండవులయొద్దకు వచ్చి యతఁడు తన యరణిని దెచ్చి యిమ్మని వేఁడెను. పాండవు లార్తత్రాణపరాయణు లగుట వెంటనే యా జింకకొఱకై వెదుకసాగిరి. ధర్మరాజు నానతిఁగొని నకులుఁడు జలంబులకై సమీపమున నున్న తటాకమున కేఁగి నీరు ద్రావ నుండ నొక యశరీరభూతము "ఈ తటాకము నాయది. నాప్రశ్నలకుఁ బ్రత్యుత్తర మొసఁగి నీరు త్రావుము. అట్లు చేయవేని విగతాసుఁడ వగుదు" వని పలికెను ఆ మాటలను నకులుఁ డనాదరముచేసి కొలనిలోని నీరు ద్రాగి మూర్ఛితుండయ్యెను. ఎంత సేపటికిని నకులుఁడు రాకుండుటచే దానికి హేతు వెఱిఁగి రమ్మని ధర్మరాజు సహదేవుని బంపెను. అతఁడు నా విధముగనే మూర్ఛితుఁడయ్యెను. క్రమముగ నర్జున, భీములఁ బంచిన వారు నట్లయిరి. ధర్మ రాజు, పోయిన తమ్ము లందఱుఁ దిరిగి రాకుండుట కేమియో హాయ యుండునని యెంచి స్వయముగ వెళ్లెను. ఆ సరస్తీర మునఁ దన నల్వురు తమ్ములు మూర్ఛితులై పడియుండుటఁ గాంచి యతఁడు నివ్వెఱపోయి "దుర్యోధనాదులు మాయా ప్రవీణులు. వారిని నమ్మఁగూడదు. వారి వంచనవల్లనే నా యీ తమ్ములు మూర్ఛితులైయుండి యుందురు. వీరలను సజీవులం జేయు నుపాయ మేదియో ?" అని యాలోచింప సాగెను.

ధర్మరాజు దిక్కు తోఁపమిఁ దృష్ణాపీడితుఁడై యా తటాకము లోని నీరు ద్రావ నుపక్రమించుచుండ యథా ప్రకార మా యశరీరభూతము 'ఇది నా తటాకము! నే నడిగిన

ప్రశ్నలకు సమాధాన మొసఁగినట్లైన నిందలి నీరు ద్రాగ వచ్చును. అట్లు చేయక జలపానముఁ జేసినచో నీ తమ్ముల వలె నీవు నసువులఁ బాసెద'' వనెను. ఆ పలుకులకు ధర్మ రాజు విస్మితుండై ''నా యోపినకొలఁది నీ ప్రశ్నలకు సమా ధాన మొసఁగెద'' నని చెప్పెను. అంతవఱకుఁ దటాకమున బకరూపమున నున్న యక్షుఁ డొకఁడు స్వస్వరూపమున వచ్చి ధర్మరాజు కట్టెదుట నిలువఁబడి యిట్లు ప్రశ్నలడుగ మొదలిడెను.

యక్షుఁడు —సూర్యుని నడపున దెద్ది? అతని నెవ్వరు కొలిచి తిరుగుదురు? అతఁడు దేనివలన నస్తమించును? అతని కాధార మేది?

ధర్మరాజు :—సూర్యుని నడపించెడునది బ్రహ్మము. దేవత లతనిఁ గొలిచి తిరుగుదురు. ధర్మముచే నతఁ డస్తమితుఁ డగును. సత్య మతని కాధారము.

యక్షుఁడు :—దేనివలన శ్రోత్రియుం డనఁబడును? జనుఁడు దేనివలన మహిమఁ బడయుచుండు? దేనిచే సహాయ వంతుఁ డగుచుండు? బుద్ధిమంతుఁ డెట్లగును?

ధర్మరాజు :—శ్రుతముచేత శ్రోత్రియుం డగును; తపోయుక్తుఁడై మహిమఁ బడయును; ధృతిచేత సహాయ వంతుండగును; బుధసేవవలన బుద్ధిమంతుఁ డగును.

యక్షుఁడు :—భూదేవునకు దేవభావ మెట్లు గలుగును? సాధుభావము, నసాధుభావమును, మానుషభావము నతఁ డెట్లు పొందుచుండును?

ధర్మరాజు :—భూదేవుఁ డధ్యయనమున దేవభావముఁ బొందును. అధిక వ్రతశీలతచే సాధుభావమును, విశిష్ట వృత్తి నెడఁబాసిన నసాధుభావమును పొందును. శౌచ నియతి లేక మృత్యుభయ సంగతుఁడైన భూదేవుఁడు మానుష భావము నందును.

యక్షుఁడు :—జీవన్మృతుఁ డన నెట్టివాఁడు ?

ధర్మరాజు :— దేవాతిథి, పితృ, భృత్యుల కొసఁగక తానే భుజించువాఁడు జీవన్మృతుఁడు.

యక్షుఁడు :—భూమికన్న భారమైన దెద్ది ? ఆకాశమునకంటెఁ బొడవైన దెయ్యది ? వాయువుకన్న వేగము గల దెద్ది ?

ధర్మరాజు :— భూమికన్నఁ దల్లి భార మెక్కువ. ఆకసమున కన్నఁ దండ్రి పొడవు. వాయువేగముకన్న మనోవేగ మెక్కుడైనది.

యక్షుఁడు :—ధర్మమునకు మూల మెద్ది ? కీర్తి కాశ్రయ మెయ్యది ? స్వర్గమార్గ మేది ? సుఖములకుఁ గారణ మేమి ?

ధర్మరాజు :—దాక్షిణ్యమే ధర్మమునకు మూలము. కీర్తికి దాన మాశ్రయము. సత్యభాషణమే స్వర్గమునకుఁ ద్రోవ. శీలమే సుఖకారణము.

యక్షుఁడు :—నరునకు దైవికమైన చుట్ట మెవ్వరు ? ధర్మములలోనెల్ల నుత్తమధర్మమెయ్యది ?

ధర్మరాజు :—నరునకు దైవికమైన చుట్టము భార్య. అహింసయే ధర్మములలోనెల్ల నుత్తమమైనది.

ఇట్లు యక్షుఁ డడుగు ప్రశ్నల కన్నిటికిని ధర్మరాజు తిరుగులేని సమాధానము లొసఁగెను. ధర్మరాజున కున్నట్లుండి సందేహము గలిగి "మహానుభావా! నీవు సామాన్య యక్షుఁడవు గావు—ఇంద్రుఁడవో, యీశ్వరుఁడవో కానోపుదువు. నిజముఁ దెలుపు" మనఁగా యక్షుఁడు మందస్మిత వదనారవిందుఁడై "పాండవాగ్రజా! నేను ధర్ముఁడను. సత్యము, శౌచము, తపము, శమము, దాంతి, కీర్తి, పరిజ్ఞాన మనునవి నా యాకారములు. అట్టినాకుఁ బుత్రుఁడవై యుత్తమధార్మికుఁడవైన నిన్నుఁ గన నేతెంచితిని. కుమారా! నీ సదుత్తరములకుఁ జాల సంతసించితిని. నీయెడఁ బ్రసన్నుఁడనైతిని. నీ కొక వరమిచ్చెదను. నీ సోదరులలో నొకనికి మాత్రము జీవముల నొసఁగెదను. ఎవ్వనిని బ్రతికింపఁ గోరుదువో కోరుకొమ్ము" అని పలికెను. అంత ధర్మరాజు భక్తియుక్తుఁడై నమస్కారము గావించి "దేవా! మూర్ఛితుఁడై పడియున్న నకులుని బ్రతికింపుము. నా కదియే పదివే" లని ప్రార్థించెను. ధర్ముండు నగుచు "నీ సోదరులును, వీరకులాలంకారులునగు భీమార్జునులలో నొకనిని బ్రతికింపుమని యడుగక నకులుని బ్రతికింపుమని యేల అంటివి?" అని యడుగఁగా ధర్మరాజు వినయ మచ్చుపడ "మహాత్మా! మాతండ్రి కిర్వురు భార్యలు కదా! కుంతికిఁగాను నేనున్నాను. మాద్రీ సంతానమున కతఁడు బ్రతికి యుండవలదా?" అని పలికెను.

ధర్మరాజు త్యాగ మేమని పొగడఁగలము? గాండీవ బలదర్పితుఁడై, సురాసురులకైన జంకని యర్జునునిఁగాని

తన గదాఘట్టనమునఁ జతుర్దశ భువనములను సంక్షోభింపఁ జేయు భీమునిఁగాని కోరుకొనక నకులునిఁ గోరుకొని ధార్మికతఁ గనుపఱచిన యీ ధర్మరాజు బుద్ధికి మెచ్చి ధర్ముఁడు భీమాదుల నందఱను బ్రతికించి మఱియొక వరముఁగోరుకొమ్మని యనెను. వెంటనే ధర్మరాజు "దేవా! బ్రాహ్మణుని యరణిని మృగ మపహరించుకొని పోయెను. అతఁడు కర్మలోప మయ్యెనని వగచుచుండును. కావున నా యరణి నతనికిఁ బ్రసాదింపు" మని ప్రార్థించెను. ధర్ముఁడు "నీ మనస్సు నెఱుఁగుటకై నేనే యట్లు దాని నపహరించితిని. మఱల నా బ్రాహ్మణున కరణి ననుగ్రహించితిని. పదుమూఁడగు నేఁడు వచ్చుచున్నది. మీ రే రూపములు ధరించి యున్న నా రూపములతోనే యొప్పి యొరులు గుర్తింపకుండునట్లు వర మిచ్చితిని. ఇం కెయ్యది కావలయునో కోరుకొ"మ్మనియెను. అందులకు ధర్మరాజు "నిన్ను గనుటచే నా కొదువ లన్నియును తీరినవి. అయినను నా మనస్సు క్రోధ, మోహాదులకు దూరమై ధర్మమునందే నిలుచున ట్లనుగ్రహింప వేఁడెద" నని యడుగ 'నట్లే యగుత'మని ధర్ముఁ డంతర్హితుఁడయ్యెను. ధర్మరాజు సోదరసహితుఁడై యాశ్రమమునకు వచ్చి సుఖముగ కాలముఁ బుచ్చుచుండెను.

---

# 9

## (i) అజ్ఞాతవాసము

నిరంతర మతిథిసపర్యలతోడను, పుణ్యకథాశ్రవణములతోడను, పాండవు లరణ్యవాసమును పండ్రెండేండ్లు

గడపి, యజ్ఞాతవాసమును జేయ నిశ్చయించుకొనిరి. పురోహితుఁడగు ధౌమ్యునివలన సేవాధర్మము లెఱిఁగి, యతనిచే ననుజ్ఞాతులై వెంట నున్న బ్రాహ్మణులకు నమస్కరించి వారి యాశీర్వాదము లందుకొని ద్రౌపదితోడఁగూడి ప్రయాణమైరి.

ఒకచో నందఱు విశ్రమించి యుండ ధర్మరాజు "విరటుని రాజ్యము సస్యసమృద్ధమని, ధర్మమున కాటపట్టని విందుము. అచటి కేఁగి యతనిని గొలిచి యుందుమ" మనఁగా నర్జునుఁడు గన్నీరు కార్చుచు "మీ రే వేషమున నచట నుండెద"రని యడిగెను. దానికి ధర్మజుఁడు "నేను సన్యాసివేషమునఁ గొల్తు" నన నందఱును రాజశ్రేష్ఠుఁడును ధర్మమూర్తియునగు నతనికి వచ్చిన యిడుమపాటునకు దుఃఖించిరి. పిదప వారు తమ తమ వేషములను, నామధేయములను నిర్ణయించుకొనిరి. ధర్మరాజు సన్యాసివేషముతో కంకుభట్టను పేరను, భీముఁడు వంటలవాఁడుగ వలలుఁ డనియును, పార్థుఁడు నాట్యాచార్యుఁడుగ బృహన్నల నామాంకితుఁడుగను, నకులుఁ డశ్వరక్షకుఁడుగ దామగ్రంథి యను నభిధానముతోను, సహదేవుఁడు గోసంరక్షకుఁడుగఁ దంత్రీపాలాభిధేయుఁడుగను, ద్రౌపది సైరంధ్రీ వేషమున 'మాలిని' యను పేరను ద మ్మితరు లెఱుఁగకుండునట్లు ప్రచ్ఛన్న వేషములు ధరించి యస్త్రశస్త్ర, గాండీవ గదాద్యాయుధంబులను నగరోపకంఠమున శ్మశానమునకుఁ జెంతనున్న శమీవృక్షముపై శవాకారముగఁ జుట్టివైచి విరాటనగరాభిముఖులై చనిరి.

విరటుఁడు మంత్రులతోఁగూడి మంతనము చేయుచుండ సన్యాసివేషముతో ధర్మరాజాతని సభలోఁ బ్రవేశించెను. ధర్మజుని ముఖమునందలి రాజతేజమును, శాంతిప్రసన్నతలను జూచి విరటుఁడును, సదస్యులు నాశ్చర్యపడిరి. ఆ యాజాను బాహువులను, విశాలమైన నేత్రములను, ప్రత్యంగసౌంద ర్యమును బరీక్షించి "మహారాజెవఁడో సన్యాసివేషమున నుండి యుండు"నని వార లూహించిరి. ఆ వచ్చిన సన్యాసికి విర టుఁడు మర్యాద గావించి స్వర్ణసింహాసనమునఁ గూర్చుండ నియోగించి "మీ దే దేశము? మీ రాకకుఁ గల కారణ మెయ్యది? అనుగ్రహింపుఁడు" అని వినయవిధేయతలతో నడిగెను. ఆ సన్యాసి "దేశము లన్నియు మావే! నే నిది వఱలో ధర్మరాజునొద్ద నుంటిని. ఆయనతోఁ బురాణగోష్ఠి సల్పుచు, విరామవేళలందు పాచిక లాడుచుంటిని. ధర్మరాజు మాయాద్యూతవంచితుఁడై సతీ, సహోదరసహితుఁడై యడవులపా లయ్యెను. నేనును దేశములపాలై యిపుడు ని న్నాశ్రయింప వచ్చితిని. నాపేరు కంకుఁ"డని చెప్పెను. "ఇంతకన్న మాకు మహాభాగ్య మేమి గల"దని విరటుఁడు సంతోషించి ధర్మరాజును సగౌరవముగఁ దనయొద్ద నుంచు కొనుటకు సమ్మతించెను. ఇతరులును విరటుని దగ్గఱఁ జేరి తమ తమ నిధులను సక్రమముగ నిర్వర్తించుచుండిరి.

విరటుని భార్యపేరు సుధేష్ణ. ఆమె సోదరుఁడగు కీచ కుఁడు సుధేష్ణ కలంకారములఁ గావించుచు సైరంధ్రీవేష మున నున్న ద్రౌపదిం జూచి మోహపరవశుఁ డయ్యెను. తన యక్కకీ విషయముఁ దెల్పి, సైరంధ్రిని తన యింటికిఁ

బంపుమని ప్రార్థించెను. విరాటపట్టమహిషి వలదని యెంత బోధించినను గీచకుఁడు వినలేదు. తుద కామె చేయునది లేక మద్యము తెచ్చు నెపమున సైరంధ్రిని కీచకుని యింటికిఁ బంపెను. వాఁడు దుర్మార్గమున నామెను చెఱఁబట్టఁ బ్రయత్నింప సైరంధ్రి తప్పించుకొని సభాభవనము వైపు పాఱి పోవుచుండ నా నీచుఁడు వెంబడించెను. భీముఁ డా సమయమున వంటకట్టియలకొఱకు నచటి కేఁగుదెంచి యుండి ద్రౌపది భంగపాటుఁ జూచి కోప మాపుకొనలేక ఎదురుగ నున్న వృక్షముఁ బెకలింపఁ బ్రయత్నించుచుండ ధర్మరాజు విరటునితోఁగూడి యచటి కేతెంచి, భీముని రౌద్రము గమనించి సమయభంగ మగునని యెంచి యన్యాపదేశముగ "వంట కట్టియల కితరవృక్షములు గలవు కదా! ఆశ్రితప్రతతికి నాతపముఁ బాపుచు, ఛాయాసమృద్ధ మగు నీ భూజము నేల వలలుఁడు పెకలించఁదలఁచెనో?" యనియెను. భీముఁ డా మాటలలోని నిగూఢభావము నెఱిఁగి యా ప్రయత్నమునుండి విరమించెను. ధర్మరా జా సమయమున వహించిన యోరిమి దేవతలకైన దుర్లభము గదా!

భీముని వారించుటచే ధర్మరాజుపై ద్రౌపదికిఁ దామసము కలిగెను. చరచర నడచి వచ్చి యామె "రాజుగారు, నితరులుఁ జూచుచుండఁ గులకాంత నగు నా కిట్టి యవమానము తటస్థింప నితరులమాటఁ జెప్పనేల? ఈ విధముగ నొనర్చిన దురాత్ముని నూరక విడిచిపుచ్చిన నాడువారి గతి యేమగును?" అని కన్నీరు గార్చుచు విరటునిఁ బ్రశ్నించెను. రాజు ప్రత్యుత్తర మిడకుండుటఁ గాంచి "నీ భర్తకుఁ జెప్పు



ఉత్తర గోగ్రహణము

కొమ్ము. అతఁడు కీకుచని దండించును. నాట్యకత్తెవలె నిల్లాల
వగు నీ విట్లు సిగ్గుబిడియములు లేక, మగవా రున్న చోట,
అందును సభాస్థలమున మాట్లాడఁ దగ''దని ధర్మరాజు
ద్రౌపది నెదిరించెను. ఈ మాటలకు రోష ముట్టిపడ
''నా భర్త నటుఁడు. అంతియగాదు. అతఁడు కితవుఁడు. అట్టి
వాని భార్య నైన నే నీ పనిఁ జేయుటలోఁ దప్పేమియు లే''
దని చెప్పి యచటినుండి వెడలిపోయెను. ద్రౌపది యన్న
మాటలకుఁ గోపపడక విరటునితోఁ జిఱునగవు నగుచు
''అవమానభరమును సహింపలేక యిట్లామె మాటలాడి
యుండు''నని ధర్మరాజు పలికెను.

భీముని యాలోచన ననుసరించి ద్రౌపది కీచకునితో
నాట్యశాలకు రమ్మని చెప్పెను. గాఢాంధకారమయమగు
రాత్రిలో భీమసేనుఁ డా నర్తనశాలలోఁ గీచకునిఁ జంపెను.
కీచక మరణము లోకమున వెల్లడి యయ్యెను. సింహబలుఁ
డగు కీచకుని జంపినవాఁడు భీముఁడే యై యుండునని కౌరవు
లూహించిరి. విరటుని గోవులఁ బట్టినయెడఁ బాండవు లందున్న
యెడల బయలుపడుదు రని యాలోచించి దుర్యోధనుఁడు
త్రిగర్తదేశాధిపతి యగు సుశర్మ యనువానికిఁ గొంత సైన్య
మొసఁగి దక్షిణదిశకు వచ్చు విరటుని గోవులను బట్టుకొనవలె
నని చెప్పి పంపెను. ఉత్తరదిశకు భీష్మ, ద్రోణ, కర్ణ,
కృపాశ్వత్థామాదులతో దుర్యోధనుఁడు తాను ససైన్యముగ
బయలుదేఱి వెళ్లెను.

దక్షిణగోగ్రహణమునకు ధర్మజ, భీమ, నకుల, సహదేవులు చని సుశర్మ నోడించి గోవులను మరల్చుకొని వచ్చిరి.

ఉత్తరగోగ్రహణమునకు విరటుని కుమారుఁడగు నుత్తరునితోఁ గలిసి యర్జునుఁ డేఁగి కురుసేనల నెల్ల జయించి గోవులను మరల్చుకొని వచ్చెను. కౌరవులు క్షతగాత్రులై 'బ్రతికియుండిన శుభములఁ బడయవచ్చు' ననుకొని తిరోగమనమును సాగించిరి.

ఆ సమయమున ధర్మరాజు విరటునితోఁ బాచిక లాడుచుండెను. వార్తాహరులవలన నుత్తరుఁడు కురుసేనను జయించి వచ్చుచున్నాఁడని విని విరటుఁ డానందించుచుండుటఁ గాంచి ధర్మరాజు "మన యుత్తరుఁ డొక్కఁడే కురుసేనను గెలిచి యుండునా ? దీని కితరుల సాహాయ్య ముండి యుండును" అని యెను. ఆ మాటకు విరటుని మనస్సు చివుక్కుమన "నీ విట్లు పలుకవలదు. తప్పక నా కుమారుఁడే గెలిచి వచ్చుచున్నాఁ" డని ధర్మరాజుపై నెగిరి పడెను. ధర్మరా జంతటితో వదలక "బృహన్నలసహాయమువలననే యుత్తరుఁడు గెలిచి యుండు" నని, బృహన్నలను బొగడ నారంభించెను. విరటున కంత కంతకుఁ గోప మధికమై చేత నున్న పాచికతో ధర్మరాజు నొసటిపైఁ గొట్టెను. అం దొక గంటి యేర్పడి రక్తము గారఁ జొచ్చెను. చెంతనున్న ద్రౌపది యది చూచి తన చీర చెఱఁగుఁజించి యా రుధిరము స్రవింపకుండ ధర్మరాజు నొసటి నొత్తి పట్టెను. ద్రౌపదీ ప్రవర్తనమును విరటుఁడు

శంకించి "నీవెందు కిట్లు చేసితివి ?" అని ప్రశ్నింపఁగా నామె "ఇతఁ డొక మహానుభావుఁడు. ఈ రక్తబిందువు లెన్ని క్రింద పడునో, యన్ని సంవత్సరము లీ దేశము క్షామపీడిత మగును అందువలన నీ మేలికొఱకే యిట్లొనర్చితిని" అని తెలుపఁగా విరటుఁ డాశ్చర్యచకితుఁ డయ్యెను.

విరటుఁ డా పిదప నుత్తరునివలన నతని విజయమునకు బృహన్నలయే కారణమని తెలిసికొనెను. అతఁడు సన్యాసి వేషమున నున్న ధర్మరాజుపాదములపైఁ బడి 'నా తప్పు క్షమింపుఁ'డని ప్రార్థించెను. పాండవు లజ్ఞాతవాసమునకై తన యాస్థానమునఁ జేరిరనియు, కంక – వలల – బృహన్నలా – దామగ్రంథి – తంత్రీపాల నామములతో నున్నవారు ధర్మజ భీమార్జున నకుల సహదేవులే యనియుఁ దెలిసికొని విరటుఁడు మిక్కిలి యచ్చెరువందెను. అతఁడు వారి నెన్నోవిధముల సత్కరించెను. అర్జునునకు సుభద్రాదేవియందుఁ గలిగిన అభిమన్యునకుఁ దన కుమార్తె యగు నుత్తర నొసఁగి. విరటుఁడు మహావైభవముగ వివాహము నొనరించెను.

## (ii) రాయబారములు

పాండవులు పన్నెండేం డ్లరణ్యవాసము, నొక సంవత్సర మజ్ఞాతవాసమును ముగించిరి. బంధుజన పరివృతులై వా రుండఁగా గృష్ణుఁడు వచ్చి "మీరు నియమానుసార మరణ్యాజ్ఞాతవాసములు సల్పినారు. మీ యర్ధరాజ్యమును మీకుఁ గౌరవు లీయవలసి యున్నది. వారియొద్ద కొక దూతను బంపు టుచిత" మనియెను. పాండవుల పక్షమున ద్రుపదుఁడు.

తన పురోహితునిఁ బిలిచి చెప్పవలసిన మాటల, నడుగ వలసిన వాని నతనికిఁ జెప్పి కౌరవులకడకుఁ బుత్తెంచెను. ఆ పురోహితుఁ డేఁగి ధృతరాష్ట్రుని కొలువున ధర్మరాజాభిమతం బెఱింగించెను. భీష్మాదులు సంతోషించిరి. దుర్యోధనాదుల కా మాటలు రుచింపవయ్యెను. తుదకు ధృతరాష్ట్రుఁడు తన దూతవలన నన్నియుఁ జెప్పి పంపుదు నని యా పురోహితుని గౌరవపురస్సరముగ వీడ్కొల్పెను. ధర్మరాజాదులు ద్రుపదుని పురోహితునివలన హస్తినాపుర విశేషములఁ దెలిసికొనిరి.

అంతఁ బాండవు లుపప్లావ్యమను గ్రామమును జేరుకొని యుండ ధృతరాష్ట్రుని సందేశముఁ గొని సంజయుఁ డేతెంచెను. పాండవులు సంజయు నుచితవిధముల సత్కరించిరి. కౌరవులు దుర్మార్గులనియు, వారు పాండవులపాలి రాజ్యము నీయకున్నను, శాంతమూర్తులగు పాండవులు సహించి యూరకుండుట మేలనియు, యుద్ధమునకు నచ్చుట తగదనియు, రుధిరాన్నముకంటె భిక్షాన్నమే మేలనియు ధృతరాష్ట్రుని యభిప్రాయమును సంజయుఁడు పాండవుల కెఱుకపఱచెను. అంత ధర్మరాజు సంజయునితో "సంజయా! మే మెన్నియో కడగండ్లు పడి బ్రతికి యున్నాము. మా యర్ధరాజ్యమును మే మడుగుచున్నాము. ధృతరాష్ట్రుడు పుత్రునకు లోబడి మా నంతు రాజ్యమును మాకుఁ బంచి యీఁదలఁపడేని భీముని గదయు, నర్జునుని గాండీవముఁ దలపునకుఁ దెచ్చుకొనుమని నుడువుము. ధర్మమునకై కట్టుపడి యుంటిమే గాని, యుద్ధమునకు వెనుదీయువారము కామని తెల్పు" మని చెప్పెను.

సంజయుఁ డీ విషయములను ధృతరాష్ట్రునకు సవిస్తరముగఁ జెప్పెను. దుర్యోధనుఁడు పాండవులు చెప్పి పంపిన మాటలకు మండిపడి 'సగముపాలు గాదుకదా, యేవురకైదూళ్ళనైన నీయను. తుదకు సూదిమొన మోపునంతటి నేలనైన నొసంగను. యుద్ధమేగాని'యని మొండిపట్టు పట్టి ధృతరాష్ట్రుని నోట మాట వెడలకుండఁ జేసెను.

ఇంతకుఁ బూర్వమే పాండవుల పక్షమున నర్జునుఁడును, కౌరవుల పక్షమున దుర్యోధనుఁడును యుద్ధమునఁ దమకు సాయపడవలసినదని కోరుచు శ్రీకృష్ణునియొద్దకు వెళ్లిరి. "నేను నిరాయుధుఁడ నయి యుండి వాఙ్మాత్రసాహాయ్య మొనర్చుచుందును; అట్టి నేను కావలెనో, నావంటి బలశాలురు పదివేల మంది కావలెనో చెరి యొక్కరును కోరుకొనుఁడు" అని శ్రీకృష్ణుఁడు పలుకఁగా అర్జునుఁడు శ్రీకృష్ణునే కోరుకొనెను. నిరాయుధుఁడగు శ్రీకృష్ణునివలనఁ బ్రయోజనము లేదని భావించి దుర్యోధనుఁడు యాదవసైన్యమును గోరుకొనెను. ఇట్లు శ్రీకృష్ణుఁడు రెండు పక్షములవారికిని సాయపడెను.

పాండవులు సాక్షాద్భగవత్స్వరూపుఁ డగు శ్రీకృష్ణుని రావించి తుది రాయబారమునకై హస్తినాపురమునకుఁ బోవలసినదిగాఁ బ్రార్థించిరి. అందుల కతఁ డొడంబడెను. వేఱు వేఱుగఁ గౌరవులకుఁ జెప్పవలసిన మాటలఁ దమకు తోఁచిన రీతిని భీమార్జున, నకుల సహదేవులునుఁ జెప్పిరి. ధర్మరాజు "మహాత్మా! నీ వెఱుఁగని నీతులు, ధర్మములు లేవు; గావున, నేఁ జెప్పవలసిన దేమియును లేదు. అయిన నొక విషయమై నిన్ను బ్రార్థించెదను. కౌరవ, పాండవ వంశముల

కెట్లయిన విరోధము వాటిల్లకుండునట్లు చూడుము. సంధి కార్యమే మా యుభయులకు నభ్యుదయప్రదము. సంధి గాక యుద్ధమే పొసఁగిన బాంధవక్షయ మగును. ధృతరాష్ట్రునితో నీ మాటలఁ జెప్పి యొడంబఱచు భారము నీయది'' యని పలికెను. ఇట్లు చెప్పియు ధర్మజుఁడు కొంతవడి సంశయించి, పదంపడి ''మహాత్మా! నీవు కౌరవులకడకుఁ బోవలదని యును నొక్కబుద్ధి వొడమెను. వారు ఖలులు'' లని నివేదించెను. పరమాత్ముఁడగు శ్రీకృష్ణుఁ డతని సందేహమును గ్రహించి, తన్ను కౌరవు లేమియుఁ జేయఁజాలరని యాతని సంశయమును బోఁగొట్టఁగా, ధర్మసూతి యెట్టకేలకు సమ్మతించి మఱియు నిట్లనియె.

''దేవా! మనకుఁ గర్తవ్యము సంధియే, అది పొసఁగ దేని, యటనున్న రాజలోకము, కురువృద్ధజనము మెచ్చునట్లు, మన ధర్మస్థితి ప్రకాశించునట్లు పొనరించి రావలె నని ప్రార్థించెను. ద్రౌపది తన పరాభవముఁ దలపోసికొని కృష్ణుని హృదయము ద్రవించునట్లు విలపించెను. కృష్ణుఁ డామెకు ధైర్యముఁ జెప్పి హస్తినాపురోన్ముఖుఁడై చనెను.

హస్తినాపురమునకు శ్రీకృష్ణుఁడు వెళ్ళి ధృతరాష్ట్రుడు లొనర్చిన సత్కారము లందుకొని పుత్రప్రవాస దుఃఖితయై యున్న కుంతికడ కేఁగి యామె నూఱడించి పేరోలగమున నున్న ధృతరాష్ట్రుని చెంత కేతెంచెను; భీష్మ, ద్రోణాశ్వత్థామాదులు వినుచుండ ధర్మరాజాభిమతం బెఱింగించి, సంధియే కర్జమని పలికెను. దురహంకారదూషితుం డగు దుర్యోధనుఁ డా మాటలఁ జెవిఁబెట్టక రాయబారముకొఱకు



శ్రీ కృష్ణుని రాయబారము

వచ్చిన శ్రీకృష్ణపరమాత్మనే త్రాళ్లఁగట్ట నుంకించెను. కృష్ణుఁడీ దురాలోచననెఱిఁగి దుర్యోధనాదుల యల్పత్వమునకు, దుర్మార్గమునకుఁ గినిసి ప్రపంచమెల్లను వ్యాపించియున్న తన విశ్వరూపము ధృతరాష్ట్రునకుఁ జూపి తిరిగి యుపప్లావ్యమునకు వచ్చెను.

పాండవులకు హస్తినాపుర వృత్తాంతములఁ దెలియఁ బఱచి కృష్ణుఁడు "ఇఁక యుద్ధము తప్ప గత్యంతరము లేదు. దానికై ప్రయత్న మొనర్పుఁ"డని పాండవులకు చెప్పెను. పాండవులు తమకు సహాయముగ వచ్చు రాజులనెల్లరను సైన్య, రథ, గజా శ్వాదులతోడఁ బిలిపించుకొని యొక సుముహూర్తమున ధృష్టద్యుమ్నుని సేనాధిపతిగ నియమించుకొని శుభశకునములఁ గని వానిని జయసూచకములుగ భావించుకొనుచుఁ గురుక్షేత్రముఁ జేరుకొనిరి.

---

# 10

## (i) కురుక్షేత్రము

కురుక్షేత్ర మెల్ల సేనలతోడను, రథ, గజ, తురగ పదాదులతోడను నిండెను. కౌరవులవైపు పదునొకం డక్షౌహిణుల సేనయు – పాండవులవైపున నేడక్షౌహిణుల సేనయు సమరసన్నద్ధమై బారులుదీరి యుండెను. పటహ, భేరీభాంకార ములు చెవులు చిల్లులు పడునట్లు మ్రోఁగుచుండెను. సేనల త్రొక్కిళ్ళచే నెగయు ధూళి యాకాశమున కెఱుపురంగు వైచెను.

భీష్ముఁడు కౌరవసైన్యాధ్యక్షుఁడై సంగరపు ముగ్గ రంబున నుండెను. ఇరుపక్షముల వీరులు రణసంసిద్ధులై యుండ ధర్మరాజు శస్త్రాస్త్రధనువులను, కవచమును రథము పై నిడి పాదచారియై భీష్మునితేరివంకకుఁ బోవుటఁ గాంచి యచటివా రనేకవిధములఁ దలఁచుచుండిరి. భీష్మునిపజ్జ కరిగి ధర్మరాజు నమస్కరించి "మహాత్మా! యుద్ధముఁ జేయుటకు ముందు నీ యనుజ్ఞఁ గైకొన వచ్చితిని. నీవు మనఃపూర్తిగ దీవించి పంపిన మాకు జయము గల్గు" నని వేఁడుకొనియెను. భీష్ముఁడు సంతోషించి "నీ విట్లు వచ్చి యడుగకున్న శాప మిచ్చెడివాఁడను. వైరులను నిర్జింపఁగలవు. నీ పక్షమునఁ జేరి యుద్ధముఁ జేయు మనుట తప్ప మఱియొక వర మేదైనఁ గోరుకొ; మ్మొసఁగెద" ననియెను. భీష్మునకుఁ దనపైఁ గల యవ్యాజానురాగమునకా యజాతశత్రుఁ డానందించి "పితామహ! దుర్యోధనుని పక్షముననే యుద్ధముచేయుఁడు—నా హితము మాత్రము మనస్సులో నుంచుకొనుఁ" డన భీష్ముఁ "డా మాటలలో నీ యభిప్రాయమే" మని ప్రశ్నించెను. దానికి ధర్మరాజు భయ, వినయములతో "నిన్ను యుద్ధమున గెలుచు విధము బోధింపు" మని ప్రార్థించెను. అందులకు భీష్ముఁడు చిఱునవ్వుతో "నన్ను గెలుచుట కా దేవతలకైనఁ దరము గాదు. మంచితనముతో నా మనస్సుఁ గరఁగించి నేఁబూనిన యాయుధమును వదలునట్లు చేసినఁగాని నన్నోడింపనేర" రని చెప్పి ధర్మజుని పంపించెను. వెంటనే ధర్మరాజు ద్రోణాచార్యుని కడకేఁగి యుద్ధమున కనుజ్ఞ వేఁడి, యాతని వధోపాయమ్ము లడిగి తెలిసికొని కృపాచార్యుని యాశీస్సుల

నంది, శల్యుని చెంతకుఁ జని "నీవు కర్ణునకు సారథి వయ్యెదవు. అపుడు మాకు సహాయ మొనర్పు" మని ప్రార్థించిన నతఁ డందుల కొడంబడియెను. ఇట్లందఱచేత ననుజ్ఞాతుండై ధర్మరాజు రథారూఢుఁడై సంప్రదాయానుసారముగ గురువులకుఁ, బూజ్యులకు నమస్కారబాణములు వైచి పోరునకుఁ దలపడియెను.

అర్జునుఁడు కృష్ణసారథ్యముతో నొప్పు రథముపై సేనామధ్యంబునఁ బ్రవేశించి యా సేననెల్లఁ గలయఁజూచి బంధుక్షయ మగునని పశ్చాత్తాపముతోడఁ గృష్ణునికిఁ దన యుద్ధవిముఖత నెఱింగించెను. అర్జునుని మాటలను విని కృష్ణుఁడు "అర్జునా! క్షాత్రధర్మమునకు యుద్ధసమయమున నిట్టి భావ ముచితము గాదు. ప్రపంచమునఁ బ్రాణులు పుట్టుటయుఁ, గిట్టుటయు సహజము. మోహ మనునది బంధువులనియుఁ, బుత్రులనియుఁ, భార్యయనియు నీ మొదలగు వాంఛలఁ గలిగించుచున్నది. కౌరవుల పాపములు పండినవి. వారు బ్రదుకుటవల్ల భూభార మొకటి తప్ప వేఱొక లాభము లేదు. ఆ పాపక్షయము నీవల్ల జరుగునట్లు భగవంతుఁ డాజ్ఞాపించి యున్నాఁడు. నీ వీ కార్యమును నెఱవేర్పవలయు" నని యనేక ధర్మరహస్యము లతనికి బోధించి, తన విశ్వరూపముఁ జూపి, యర్జునుఁడు యుద్ధమునకు గడఁగునట్లు కావించెను.

## (ii) భీష్ముని సమరము

ఇరు బలంబులును రణమునకు దిగెను. భీష్ముఁడు విజృంభించి యుద్ధ మొనర్చుచుండెను. పాండవబల మంతయుఁ

గలఁగఁ జొచ్చెను. భీష్ముని కెదురుగఁ బోవుట కెవ్వరును సాహసింపరైరి. అర్జునుఁ డా ప్రతాపమునకు జంకి ప్రక్క ప్రక్కలఁ బోసాగెను. భీముఁ డెదుటకుఁ బోయియుఁ దప్పి కొనుచుండెను. ధర్మజ, నకుల, సహదేవులు, నితరవీరులును భీష్ముని బాణముల ధాకకుఁ దట్టుకొనఁజాలక పరువులెత్తు చుండిరి. 'ఎండిన యడవిలోని కార్చిచ్చు' వలె భీష్ముఁడు పాండవబలము నంతకంతకు భస్మీభూత మొనర్పసాగెను. వేనకువేలు రథములు నుగ్గయ్యెను. తలలు తెగియు, కాళ్లు విఱిగియు, నేనుఁగులు, గుఱ్ఱములు యుద్ధరంగమునఁ బడియుం డెను. లెక్కిడరానంతటి సేన నశించెను. కురుక్షేత్రమున నెత్తుటికాల్వలు పాఱఁజొచ్చెను. సాయంసమయమగుట యుద్ధము చాలింపఁబడెను. కౌరవసేనలో నానందము వెల్లి విరియుచుండెను. పాండవ బలంబులకు నిస్పృహ మిగిలెను.

ఆ రాత్రి ధర్మరాజు వ్యాకులిత మనస్కుఁడై కృష్ణుని చెంతకుఁ జని "ఆర్యా! నేఁడు పాండవబల మెల్ల భీష్ముని ప్రతాపమునఁ గుందువడినది. మన యర్జునుఁ డతనిని జయించునని యాసపడుచుంటిని. అతఁ డేలకో భీష్మునిఁ బ్రతిఘటింపఁ డయ్యెను. భీముఁడు తప్పుకొనుచుఁ దిరుగు చున్నాఁడు. వీరిని బ్రతిమాలుకొనుటకంటె యుద్ధమును మానుకొనుట మేలు. మనకు సహాయముసేయవచ్చిన రాజుల నెల్ల భీష్ముని నిశితశరపుంఖములకు బలిగాఁజేయలేను. ఇంక నడవులకు బోయి యాకు లలములఁ దిని తిరుగుచుం డెద" నని చెప్పి వాపోయెను. కృష్ణుఁ డతని వీఁపుఁ దట్టుచు "నీ వేమియు భయపడవలదు. నీతమ్ములప్రతాప మద్భుతమై

నది. భీష్ముని శిఖండి సహాయముతోఁ బరిమార్పించెదను. తరువాతఁ గ్రమముగ సందఱిని జయింపవచ్చు'' నని ధైర్యము చెప్పి సాగనంపెను.

భీష్ముఁ డతిశయపరాక్రమముతోఁ బాండవులసేనను జించి చెండాడుచు నొకే విధముగఁ దొమ్మిది దినంబులు యుద్ధముచేసెను. కౌరవసేనలో విజయోత్సాహము వెల్లివిరిసెను. పాండవబలము లంతకంతకు నపజయభీతితో 'నెండకాలపు మల్లెతీగల'వలె వ్రేలఁబడుచుండెను. భీష్ముని బాణములకు పాండవుల బలగ మెంతయో యాహుతి యయ్యెను. వీరు లెందఱో మరణించిరి. కర్తవ్యతేటున కైనను పాండవుల ముఖములలో నెత్తురుచుక్క లేదయ్యెను. 'ముందు నకుఁ బోయిన నుయ్యి, వెనకకు వచ్చిన గొయ్యి.' ధర్మరాజునకు సంకటపరిస్థితి యేర్పడెను. ఒకవైపు భీష్ముని ప్రతాప మసాధ్యముగఁ గనుపించుచున్నది.—మఱియొకవైపు తమ బలములు నానాఁటికి క్షీణించుచున్నవి. ఏమి చేయుటకు నతనికిఁ దోఁచినది గాదు.

తొమ్మిదవనాఁటి రాత్రి ధర్మరాజు దీర్ఘముగ నాలోచించి 'భీష్ము నోడించుటకు దేవునితరమైనఁ గా'దని నిశ్చయించుకొని తమ్ములను, కృష్ణుని, తనయొద్దకుఁ బిలిపించుకొని ''భీష్ముని జయించుట కలలోని మాట. శస్త్రాస్త్రముల కతఁడు లొంగువాఁడు కాఁడు. మన యర్జును లెందఱైన నతని ప్రతాపమున కోపఁజాలరు. ఎటులనైన నతనిని బడఁగొట్టు

మార్గ మన్వేషింపు'' మని కృష్ణునివైపు దీనముగఁ జూచెను. కృష్ణుఁ డొక నవ్వు నవ్వి ''నీ కేమియు భయము వలదు. ఈ యర్జునునిచే నతఁ డోడింపఁబడకున్న నే నతని నోడింతు'' నని యభయ మొసఁగెను. ధర్మరాజు ''మహాత్మా! నీ వాడిన మాటను తప్పఁగూడదు. నిరాయుధుఁడనై యుండి పాండవులకు యుద్ధములో సహాయ మొనర్తు నని కదా నాఁడు దుర్యోధనునకుఁ జెప్పితివి. అందువలన నీవు చక్రముతో నతనిఁ జంపిన ధర్మహాని యగు ; అది మాకు నవమానకరము గదా! అయ్యో! చిన్నతనమునుండియుఁ బెంచి పెద్దచేసిన భీష్మునిఁ జంపుట కుపాయము లాలోచింప నే నెంతయుఁ జింతించుచున్నాను! రాజధర్మ మెంతటి ఘోరకర్మమునకుఁ బురికొల్పుచున్నది! ధర్మహాని కలుగకుండున ట్లేదేని నుపాయమున్నఁ దెలియఁజెప్పుము. మొదటనే భీష్ముఁడు దుర్యోధనునివైపు యుద్ధముచేయుచున్నను నా హితముఁ దలఁతునని చెప్పి యుండెను. కావున నతని నే మడిగిన నడుగవచ్చు'' నని ధర్మరాజు వచింపఁ గృష్ణుఁ డతని యభిప్రాయ మెఱిఁగినవాఁడై ''మన మతనిచెంత కేఁగి నీ వధోపాయముఁ దెలుపవలె నని ప్రార్థింతము. తప్పక యతఁ డా విధ మెఱిఁగించు'' ననియెను. ధర్మరాజు ధైర్యము తెచ్చుకొని తమ్ములతోడను కృష్ణునితోడను గలసి యా యర్ధరాత్రమున భీష్ముని శిబిరముఁ జేరుకొనియెను.

భీష్ముఁడు ధర్మరాజాదుల రాకకు సంభ్రమమునొంది మర్యాదగఁ గూర్చుండ నియోగించి ''ఈ యర్ధరాత్రమున

వచ్చుటకుఁ గారణ మే"మని ధర్మరాజును బ్రశ్నించెను. దానికి ధర్మరాజు "ఆర్యా! నిన్ను రణమున గెలుచుటకు మా వశము గాదు. నిన్ను గెలిచినఁ గాని కౌరవుల నోడింపఁ జాలము. నిన్ను గెలుచు నుపాయముఁ జెప్పి మమ్ముఁ గృతార్థులఁ గావింపు" మని యతిదీనముగఁ బ్రార్థింప, భీష్ముఁడు దరహాసితవదనుఁడై "నాచేత ధను వున్నంతవఱకు నన్నోడించుట కెవ్వరితరమునుఁ గాదు. నీవు పరమశాంతుఁడవు; ధర్మమూర్తివి గావున నీపక్షమునకే జయము గల్గుట తథ్యము. నేను నపుంసకులతో యుద్ధముఁ జేయను. ద్రుపదుని పుత్రుఁడగు శిఖండిని రథముపైఁ గూర్చుండఁ బెట్టుకొని యర్జునుఁడు నాతోడఁ బోరుటకుఁ గడఁగెనేని నన్ను నిర్జింపవచ్చును" అని చెప్పి వారలను బహుమాన పురస్సరముగ వీడ్కొలిపెను.

భీష్ముఁడు దశమదినమున యుద్ధముచేయఁ గడఁగ నర్జునుఁడు శిఖండిని దన తేరిపై నెక్కించుకొని యతనిఁ బ్రతిఘటింపసాగెను. భీష్ముఁడు శిఖండివైపు చూడనందున నధోవక్త్రుఁడై యర్జునునిమీఁద శరపరంపరలఁ గురిపింపసాగెను. భీష్ముని బాణములనెల్లఁ బ్రతిహతిము గావించుచు నర్జునుఁడు వాఁడిమయూఖములచే భీష్ముని శరీరమును నొప్పింపసాగెను. భీష్ముఁడు కుంఠితప్రతాపుఁడై, రుధిరసిక్తదేహుఁడై రథముపై శోషిల్లెను. కౌరవ బలంబు లెల్ల

'హాహా' రావములు సేయుచుండఁ బాండవబలములు విజయ భేరులను బ్రమోయించుచుండ సారథి రథమును యుద్ధరంగము నుండి మరల్చుకొని పోయెను.

## (iii) ద్రోణుని సంగరము

భీష్మభానుఁడు సమరరంగమునుండి యస్తమించుట తోడనే కౌరవపద్మములు ముకుళించెను. విజయచంద్రికలు హృదయరంగముల వెల్లివిరియఁ బాండవ నీలోత్పలములు వికసించెను. దుర్యోధనాదులు భావికార్యక్రమమును గూర్చి తీవ్రముగ నాలోచింపఁదొడఁగిరి. అందటి యభిప్రాయములను గైకొని దుర్యోధనుఁడు ద్రోణాచార్యులను సైన్యాధ్యక్షు నిగ నియోగించెను. ఆ పదవికి ద్రోణుఁ డుప్పొంగి దుర్యోధను నేదైన వరముఁ గోరుకొమ్మన, నతఁ డానందపరవశుఁడై "ధర్మరాజును నాకుఁ బ్రాణములతోఁ బట్టి యొసఁగు" మని యడిగెను. ద్రోణుఁ డందులకుఁ జింతించి "ధర్మరాజును యుద్ధ మున వధింపమనక, యతనిని బ్రాణములతో నప్పగింపుమని యడిగితివేల? వారి యర్ధరాజ్యమును వారి కీయఁదలఁ చితివా?" యని ప్రశ్నింప దుర్యోధనుఁడు "దేశికోత్తమా! పాండవులను జయించుట దుర్ఘటము. లేదా వారి నందటి యుద్ధమున నిహతులఁ గావించినక్తైనఁ గృష్ణుఁడు మనలను వధించి రాజ్యమును కుంతీదేవి కొసఁగును. కాఁబట్టి ధర్మ రాజును బ్రాణములతోఁ బట్టి తెచ్చిన నతనితో మరల

జూదమాడి పాండవుల నరణ్యములకుఁబంపవచ్చు" నని తన మాయోపాయమును వెల్లడించెను. ద్రోణుఁడతని దుర్మార్గ బుద్ధికిఁ జింతించి "అర్జునుఁడు రణరంగమున నున్న, ధర్మ రాజును బట్టుట యసాధ్యమైన పని. అర్జునుని స్థలాంతరము నకు గొని పోయినచో నామాటఁ జెల్లించుకొందు" నని చెప్పి యుద్ధమునకు బయలుదేఱెను. సూర్యోదయానంతరము యథారీతిగ నుభయసైన్యములును యుద్ధసన్నద్ధములై నిలిచెను. ద్రోణుఁడు మహావీరుఁడు. ఇటు పాండవులకు నటు కౌరవులకును గురువు. ధనుర్వేదమున నతఁడు ప్రామాణి కుఁడు. పాండవులకు భీష్మునికంటె నితఁడు కొఱకరాని కొయ్య. ఇట్టి పరిస్థితిలోఁ గూడఁ బాండవులు ధైర్యము వీడక పోరుటకుఁ దలఁపడిరి. అంత ఘోరసంగ్రామ మయ్యెను.

ద్రోణుఁడు తన శస్త్రాస్త్రపాండిత్యముఁ జూపుచు పాండవ బలములఁ జిందఱవందఱ గావింపసాగెను. అతనిమూర్తి ప్రళయకాల రుద్రునివలె మహాభయంకరముగ నుండుటచేఁ బాండవవీరు లాతనిని దప్పుకొనుచు తిరుగసాగిరి. ద్రోణా చార్యుఁ డాశ్చర్యపడి సారథితో "ధర్మరాజుతో మాఱ్కొ నిన నందఱు నతనిని విడిపింప వత్తురు. అప్పుడు చేతులతీట తీరునట్లు యుద్ధ మొనర్పవచ్చును. రథమును ధర్మరాజు వంకకుఁ బోని" మ్మన నతఁడట్లు చేసెను.

ధర్మరాజు కూడ నాఁడించుకేనియుఁ జలింపక ద్రోణా చార్యుని కట్టెదుట నిలువఁబడి యప్రయత్నోత్సాహియై

యుద్ధముచేయ మొదలిడెను. పోరు రాను రాను తీవ్ర మయ్యెను. ఉభయులు 'నీవు ముందా—నేను ముందా' యనునట్లు శరముల నొకరిపై నొకరు ప్రయోగించుకొనుచు, నొకరి బాణముల నొకరు విఱుచుచు చూపఱ కాశ్చర్యము గలుగునట్లు రణ మొనర్చిరి. ఈ దృశ్యమును జూచువారలు "ధర్మరాజునకు ధర్మములందును, నీతి నియమములందు నున్న గొప్పతనము యుద్ధమునందును గల" దని తెలిసికొనిరి. అంతకంతకుఁ బోరు ఘోర మయ్యెను. ద్రోణుఁడు మహాస్త్రములచే ధర్మరాజును నొప్పించుచుండుటఁ గాంచి ధర్మరాజు పట్టువడెనేమో యను కలవరపాటు పాండవబలంబులకుఁ గలుగఁ జొచ్చెను. నకులుఁడు, సహదేవుఁడు, మఱికొందఱు వీరాగ్రేసరులును ధర్మరాజునకు సహాయులై ద్రోణు నెదుర్కొనసాగిరి. ఇట్లు కొన్ని క్షణములు గడచుసరికి పాండవ బలముల 'హా హా' రావములు చెలరేఁగెను. అర్జునుఁడు భయ విహ్వలుఁడై 'వృషభముపై దుమికెడు సింహంబు' పగిది కుంభ సంభవునిమీఁది కెగసి శరోత్కరముల విరామ విరహితముగఁ గుప్పించుచుఁ దన సవ్యసాచితను సార్థకపరచుకొనెను. ధర్మరాజును విడిచి పుచ్చి తనకుఁ దగిన జోడు చిక్కెనని ద్రోణుఁడు రణోత్సుకతఁ బ్రకటించుచు పార్థున కెదురొడ్డి నిలిచెను. ఇంతలో సాయంకాల మయ్యెను. ఆ నాఁటికి యుద్ధము ముగిసెను. ఎవరి శిబిరములను వారు చేరుకొనిరి.

దుర్యోధనుఁ డసంతృప్తిని వెల్లడించుచు ద్రోణుని పటకుటీరమునకుఁ బోయి యాతనిని సందర్శించి

'గురూత్తమా ! ధర్మజునిఁ బట్టితెం'డని వేఁడెను. అందులకు ద్రోణుఁడు "పార్థుఁడు రణక్షోణి నుండ నా పని సాధ్యము కాదని యిదివఱకే చెప్పితిని. రేఁపటిదినము సంశప్తకులఁ బురికొల్పి యర్జును నెచటికైనఁ గొనిపొమ్మని చెప్పుము. ఆ సమయమున ధర్మరాజుఁ బట్టితెచ్చి నీ కప్పగింతు"నని చెప్పెను. దానికి దుర్యోధనాదు లొడంబడిరి.

మఱునాఁ డుభయబలంబులును సమరప్రాంగణముఁ జేరుకొనియెను. సంశప్తకులు యుద్ధమునకుఁ బిలువ నర్జునుఁడు వారితో యుద్ధమునకు సిద్ధపడెను. ద్రోణుఁడు ధర్మరాజుఁ బట్టవలయునని విశేషప్రయత్నముతో యుద్ధము చేసినను విఫలమనోరథుఁ డయ్యెను. రాత్రి శిబిరముఁ జేరుకొనుటతోడనే దుర్యోధనుఁడు ద్రోణునికడ కేతెంచి "నీవు ధర్మరాజును బట్టలేకున్నావు. నీ కతనిపైఁ గల ప్రేమవల్లనా ? కాక శక్తి లేకయేనా ? నాకేమియు బోధపడుట లే"దని రోషము వచ్చునట్లు పలికెను. ద్రోణుఁడు రోష మడఁచుకొని "సంశప్తకులతో సవ్యసాచిని వేఱొకయెడకుఁ దీసికొని పొమ్మని చెప్పుము. ధర్మరాజును తప్పక పట్టి యిచ్చెద"నని చెప్పి దుర్యోధనుని మనస్సు శాంతపఱచెను.

మూఁడవనాఁడు సంశప్తకులచే నాహూతుఁడై యర్జునుఁడు యుద్ధమొనర్పఁ గురుక్షేత్రమును వీడి వెడలెను. ద్రోణుఁ డా నాఁడు పద్మవ్యూహముఁ బన్నెను. కృపాశ్వత్థామ

కర్ణ, దుర్యోధనాది వీరుల నందఱ నచ్చటచ్చట నిలిపి ద్రోణుఁడు తాను మొగ్గరంబున నిలువఁబడియెను. ధర్మరాజ, భీమాదుఁలా వ్యూహభేదనము నెఱుఁగ జాలనివారై యొకరి మొగము నొకరు చూచుకొనుచు దిక్కుతోఁచక యుండిరి.

ధర్మరాజు పరాజయవ్యగ్రమానసుఁడై యభిమన్యుఁ డున్న శిబిరముకడకేతెంచి యతనింగాంచి "కుమారా! నేఁడు ద్రోణాచార్యులు పద్మవ్యూహముఁ బన్నియున్నవాఁడు. దానిని భేదించు తెఱవు కృష్ణార్జునులు, నీవుఁదక్క నితరు లెఱుఁగరు. నీవు వచ్చి వ్యూహభేదన మొనర్చిన మేమెల్లరము లోనికిఁ జొచ్చికొని వచ్చి నీకు సహాయపడఁగలము" అని దీనముగ పల్కుటతోడనే యా యభిమన్యువీరకిశోరము సశరాసన కార్ముకుఁడై రథారోహణముఁ గావించి సమరప్రాంగణముఁ జేరఁజనియెను.

తన ప్రశిష్యుఁ డిట్లు సమరసన్నాహియై వచ్చుటఁ గాంచి ద్రోణుఁ డత్యంత కుతూహలియై యాతనితోఁ గలియఁ బడెను. ద్రోణుని నిశిత సాయకములచే నొప్పించి 'జయ జయ' ధ్వానములు రోదసీకుహరమునఁ బ్రతిధ్వనించుచుండఁ నభిమన్యుఁడు వ్యూహభేదనముఁ గావించి "యేనుఁగుల గుంపుపైఁబడు సింగంపుఁగొదమ"వలె నా వీరబృందముపైఁ గవిసి చిత్రవిచిత్రగతుల యుద్ధము సల్పుచుండెను.

ధర్మజ, భీమాదులు వ్యూహముఖమున నున్న సైంధవుని చేత నివారితులైరి. సామాన్యబలశాలియైన సైంధవుఁ డసామాన్య బలోదగ్రులగు కౌంతేయుల నీశ్వర వరప్రసాద

మున ని ట్లడ్డగింపఁగలిగెను. దైవబలమున కేదు రే ముండును ? కౌంతేయులు నిర్వ్యాపారులై సాహసముఁ దక్కి నిలుచుండిరి. ధృష్టద్యుమ్నాదు లభిమన్యునకుఁ దోడ్పడ వ్యూహమధ్యముఁ బ్రవేశించిరి.

అభిమన్యుఁ డా వీరులఁ జించి చెండాడసాగెను. ఆతని వీరోద్ధతికి, మారణవిజృంభణమునకును దట్టుకొనఁజాలక కౌరవ వీరులు చెల్లాచెదరైరి. ద్రోణునితో దుర్యోధనాదులు దురాలోచనముఁ జేసి యీ బాలు నధర్మయుద్ధమున మడియింపఁ గృత నిశ్చయులై యొక్కపెట్టున నతనిపైఁ బడి 'కిరాతులు వరాహమును వేఁటాఁడుభంగి దోప' నతనితోఁ బోరి వానిని విగతజీవుఁ గావించిరి. అభిమన్యుని శరీరము రక్తప్లావిత మయ్యెను. అస్తగిరియు రుధిరద్యోతుల నా వీరకిశోరమునకు మంగళహారతి నొసఁగెను.

పాండవుల శిబిరములం దానాఁటి రేయి రోదనధ్వనులు మిన్నుముట్టెను. ధర్మరాజు "అయ్యో ! నేనెంత పాపముఁ జేసితిని ! భోజనమునకు, వస్త్రములకుఁ బ్రీతితోఁ గుమారు నాహ్వానించువా రుందురుగాని, యుద్ధమునకుఁ బిలుచువాఁ డెందైన నుండునా ? పాపకర్ముఁడను; మతి విహీనుఁడను" అని వాపోయియుఁ బిదప నభిమన్యు మరణదుఃఖావిలమానసులై యున్నవారల నూఱడించెను.

అర్జునుఁడు సంశప్తకుల గర్వమడఁగించి శిబిరప్రాంతమునకేఁగుదెంచి, త్రోవలోఁ గలిగిన దుశ్శకునములకుఁ గీడుఁ జింతించినవాఁడై ద్రోణుని ప్రతిజ్ఞఁ దలపోసికొని ధర్మరాజు

శిబిరముఁ జొచ్చెను. ధర్మరాజు రుద్ధకంఠముతో నభిమన్యు నిధనప్రకారముఁ దెలుప 'నాజ్యముఁబోయ భగ్గునఁ దఱికొను హుతాశనునిఁబోలె నెగిరిపడి యా యక్రమవధకు సైంధవుఁడే కారకుఁడుగా నెఱిఁగి "రేపు సూర్యుఁ డస్తమించులోపల సైంధవుని శిరముఁ ద్రెంచెదను. అట్లు కాదేని సగాండీవముగ నగ్నికుండమునఁ బడుదు"నని ఘోర ప్రతిజ్ఞఁ గావించెను.

ఆ మఱునాఁడు సైంధవుని శిరము నర్జునుఁడు శ్రీకృష్ణ సాహాయ్యమునఁ దెగవైచెను. కురుసేన యెల్లయు 'వాయుహత సముద్రంబు' పగిది సంక్షుభితమగుటఁ గాంచి దుర్యోధనుఁడు ద్రోణుని ధిక్కరించి పోటుమాట లాడెను. ద్రోణుఁ డిట్టి యవమాన మనుభవించి బ్రతుకుటకంటె చచ్చుటయే మేలుగాఁ దలఁచి మహోదగ్రమూర్తియై నాఁటి రేయి చంద్రోదయ మగుటతోడనే యుద్ధమును ప్రారంభించి పాండవసైన్యమును పొడిపొడిఁగావింప మొదలిడెను. రాత్రి సమరము ఘోరముగ నయ్యెను. కురుక్షేత్రమందు నెత్తురుటేరులు పాఱఁజొచ్చెను. పీనుఁగు పెంటలతో నరకలోకమువలె నా ప్రదేశ మొప్పియుండెను. చీఁకట్లు వీడిపోవుటతోడనే సూర్యుఁ డుదయాద్రి నధిరోహించెను. సూర్యుని వేఁడిమి వృద్ధియగునట్లు ద్రోణుని ప్రతాపముగూడ నభివృద్ధి కాఁజొచ్చెను.

పాండవులు పరాజయ సంత్రస్తులైరి. వారి ముఖములందు జీవకళ సన్నగిల్లెను. కృష్ణుఁ డీ పరిస్థితి నవలోకించి

"ద్రోణుని జయించుట దుర్లభము. దీని కొక యుపాయము. వాలోచించితిని. అశ్వత్థామ చచ్చెనని యతఁడు వినిన యుద్ధము నుపసంహరించుకొనును. ఇది తప్ప మనకు వేఱొక గతి లేదు" అని వ్రాకువ్వ నసత్యమాడుట కందఱును జంకుచుండిరి. అంతకు ముందే భీముఁ 'డశ్వత్థామ' యను గజమును వధించి యుండుట నతఁడు ద్రోణుని రథమును సమీపించి "యశ్వత్థామ చచ్చె" నని చెప్పెను. ఆ మాటను వినినది. మొదలు ద్రోణుని మనము ప్రశాంతరహిత మయ్యెను—. కాని యుద్ధమును జేయుచునే యుండెను.

భీముఁడు ధర్మరాజుచెంత కేతెంచి తా నసత్యమాడి. నట్లు ద్రోణుఁ డనుకొనియె నని తెలుపుచు "నీనోట నా మాట వచ్చిన నతఁడు నీవు సత్యసంధుఁడవగుటఁ దప్పక విశ్వసించును. అర్జునుఁ డతని బాణజాలములను నివారింపఁ జాలకున్నాఁడు. నీ వెట్లైన మన క్షేమముకొఱ కా మాట. నాడక తప్ప" దని నిర్బంధించెను. ధర్మరాజు కొంతతడ వాలోచించి "విజయముకొఱకై యసత్య మాడవలసివచ్చినది. నా మోమున బ్రహ్మదేవుఁడిట్లు వ్రాసెను. రాజధర్మ మెన్నివిధములుగ నన్ను పరీక్షించుచున్నది ! గురువు నసత్య భాషణమున వంచించు గతి యేర్పడిన" దని యధర్మభీతికి, ననృతపాపమునకుఁ గుందుచు ద్రోణునిరథమును సమీపించి విస్పష్టాక్షరముగ "అ...శ్వ...త్థా...మా...హ...తః" యని పిదప మెల్లగ 'కుంజరః' అని వచించెను. ద్రోణునకు ధర్మ. రాజు నిరతసత్యవ్రతుఁ డను నమ్మకముండుటఁ దన కొడుకు

మృతుఁడై యుండునని నమ్మి విరక్తుఁడై యతఁడు ధనుర్వ్యాపారముఁ జాలించెను. అట్టి సమయమునకై నిరీక్షించుచున్న ధృష్టద్యుమ్నుఁడు ద్రోణుని కంఠమును దునిమెను.

ద్రోణుని మరణమువలనఁ గౌరవులకు జయాశ సన్నగిల్లెను. అందఱి ముఖములందును నిరాశయే తాండవింపసాగెను. దుర్యోధనుఁడు తన పక్షపు వీరుల నెల్ల రావించి వారివారి యభిమతములను గుఱుతించి కర్ణుని వాహినీపతిగ నియోగించెను.

పాండవు లా నాఁడు 'తలమీఁది భారము దించుకొన్నట్లు' ద్రోణుని మరణమువలనఁ దమ కిఁక యుద్ధమునఁ బ్రయాసము లేదని సుఖముగ నిద్రించిరి. ఒక్క ధర్మరాజునకు మాత్రము నిద్ర పట్టలేదు. 'చేయఁదగని దోషమును నే నొకటి చేసితిని. గురుఁడు, హితుఁడునైన ద్రోణాచార్యులను వీరోచితవృత్తిని వధింపఁజాలక కుహనోద్యోగంబునఁ జంపించుటకు సాహసించిన నీచుఁడ నైతిని.. విజయముపయిఁ గల యాశయే నన్నిట్టి దుష్కృత్యమునకు నొడిగట్టఁ జేసినది. ఈ పాపపరిహారమునకు నాకే మార్గమును దోఁచుటలే''దని చింతాక్రాంత మనస్కుఁడై యాతఁ డా రాత్రి వేఁగించెను.

## (iv) కర్ణుని కదనము

మఱునాఁడు ధ్వజినీసహితుఁడై కర్ణుఁడు మకర వ్యూహము పన్ని వీరభయంకరుఁడై సేనాముఖమున నిలిచెను. అర్జునుఁ డద్దానిఁ జూచి దిక్కుతోఁచక యుండ ధర్మరా జచటి

కేతెంచి "యర్ధచంద్రవ్యూహము పన్నుము. దానితో మకరవ్యూహమును భేదింపవచ్చు"నని సూచింప నతఁ డట్లు గావించెను. అచటివా రెల్లరు యుధిష్ఠిరుని యుద్ధతంత్రజ్ఞతను విశేషముగఁ గొనియాడిరి. అర్జునుఁడు కర్ణునితోఁ బోరుటకు దలపడి తన ధనుర్విద్యానైపుణ్యముఁ బ్రదర్శింప మొదలిడెను. ఇరువాఁగులవారికిని సంకులసమర మయ్యెను.

ధర్మరాజు దుర్యోధనుఁ డడ్డంబైన నెదురొడ్డి నిలిచి యెడతెఱపి లేకుండ బాణములఁ బ్రయోగింప మొదలిడెను. ధర్మజుఁడు కడకు దుర్యోధనుని విల్లును, రథముఁ ద్రుంచి చూపఱ కాశ్చర్యముఁ గలుగఁజేసెను. దుర్యోధనుఁడు పలాయనమంత్రము జపించి, పునస్సముత్సాహియై వేఱొండు తేరెక్కి ధర్మరాజుపై కెగసి యుద్ధముచేయ నారంభించెను. ధర్మరాజు వానిపోగ రణఁగింప నొక మహాస్త్రమును వదలి దుర్యోధనుని మూర్ఛాగతుఁ గావించెను. కౌరవబలములలో "దుర్యోధనుఁడు ధర్మరాజుచేఁ జచ్చె"నను కలకలము పుట్టెను. అజాతశత్రుని ప్రతాప మనియెడు నగ్నికి మిణుఁగురుఁబుర్వులవలె వచ్చి వ్రాలెడు కౌరవబలంబులు విగత ప్రాణము లగుచుండెను. సాయంసమయముతోఁ బాటు కర్ణుని ప్రథమదినసమరము సంపూర్ణ మయ్యెను.

రెండవ నాఁడు కర్ణుఁడు 'కుబుసము విడిచిన నాగుఁబాము' వలె నొడలెల్ల విఱుచుకొని యుద్ధభూమిలో విచ్చలవిడిగ సంచరింపఁదొడఁగెను. శల్యుని సారథ్య మతని వీరత్వమున కొక యలంకారముగ నుండెను. పాండవవీరులు కర్ణుని

యా విస్ఫూర్జిత ప్రతాపమునకు జడిసి యా చెంతకేఁగుటకైన సాహసింపరైరి. అర్జుననంతటివాఁడు గూడ "రథమును మరలింపుము. బ్రతికియున్న శుభములఁ బడయవచ్చును; గ్రీష్మకాలపు సూర్యునివలె నుగ్రముగ నున్న కర్ణునితో. దాఁకుటకు సందేహించుచున్నా"నని కృష్ణునితోఁ జెప్పి ప్రక్క ప్రక్కల సంచరించుచుండెను.

కర్ణునితో ధర్మరాజు డీకొనియెను. కర్ణుఁడు 'నీ గర్వ మడఁతు నిదిగో!' యని వాఁడితూపుల ధర్మజు నొప్పించి, రథముఁ దునియలు గావించి యతఁడు పాఱిపోవుచుండ నడ్డగించి నీచపుమాటలాడి పంపించెను. ధర్మరాజు శరపుంఖ క్షత గాత్రుఁడై బాధాపనయనార్థము శిబిరమునకుఁ జని శైత్యోపచారములను, వైద్యోపచారములను పొందుచుండెను.

కృష్ణార్జునులు కర్ణునితో మాఱ్కొన సమయము గాచని ధర్మరాజుసేమ మరయ నతని నివాసమున కరుదెంచిరి. ధర్మరాజు వారలఁ జూచుటతోడనే కర్ణుని వధానంతరమే వచ్చియుందురని భావించి "మీరు కర్ణునిఁ జంపితిరిగదా! అర్జునా! నీ ప్రతాప మద్భుతమైనది. శ్రీకృష్ణుని సహాయమున నెంతటి వారినైన నోడఁజేసెదవుగదా!" అని స్తోత్రపాఠముఁ జదువ నారంభించెను. కర్ణునివలనఁ దనకు జరిగిన భంగపాటెల్లఁ బూసఁగ్రుచ్చినయట్లు యుధిష్ఠిరుఁడు చెప్పసాగెను. అర్జునుఁ డాతని నూఱడించి "భీముఁ డొక్కఁడే యుద్ధభూమి కేఁగినాఁడు. మే మతనికి సహాయముగఁ బోవలయు" నని తత్తఱపాటుతోఁ జెప్పుటవలనఁ గర్ణుఁడు సజీవియై యున్నాఁ

డను విషయ మెఱిఁగి ధర్మరాజు కోప మాపుకొనలేనివాఁడై యర్జునునివైపు మొగముఁ ద్రిప్పి "అర్జునా! కర్ణునితోడి పోరులో నే నొక్కఁడనే యోడితి ననుకొంటిని. నీవుకూడ నోడితివి—భీమాదు లింతకుముందే పరాజితులైరి. మనతోఁ బాటు కృష్ణుఁడు నోడెను." అని పలుకుచు బాధాతిశయ మ్మునఁజేసి యపగతశాంత స్వభావుఁడై "నీవు కుంతికడుపునఁ బుట్టకుండిన బాగుండెడిది. లేదా, పురిటిలోనే గతించిన మఱియు బాగుండెడిది. ఇన్ని కష్టములు రాకపోయెడివి! నీ గాండీవముపై నాసలు పెట్టుకొనియున్న మాకు మంచి ప్రాయశ్చిత్తముఁ జేసితివి. శ్రీకృష్ణుఁ డుండఁ గర్ణునితో యుద్ధ మొనర్పక మరలి వచ్చిన నిన్నేమనవచ్చును? నీవు సారథివై, యాతనిని రథికునిగఁ జేసి గాండీవ మతని కప్పగించిన, శ్రీకృష్ణుఁడు కర్ణుని క్షణకాలములోఁ జంపియుండునుగదా!" యని నిష్ఠురోక్తుల నర్జునుని దూషించెను.

అర్జునుఁ డన్న పల్కిన మాటలకు శాంతము వహింపఁ బ్రయత్నించెను. కాని కోపోద్రేక మతనిని మైమఱపించెను; ఒఱలో నుంచిన ఖడ్గముఁ గొని ధర్మజుని శిరము నఱుకఁ బోయెను. కృష్ణుఁ డతనిని వారించి "అర్జునా! నీ సహోదరుఁడు, మహాధర్మశాలి, పరమశాంతమూర్తి, విష్టపత్రయపూజ్యుఁడు నైన ధర్మరాజు నిట్లు వధింపఁ బూనుకొనుట నీకుఁ దగునా? మహామహుఁ డగు నితనిఁ దిట్టినంత వధించినట్ల యగు. నీ పీ

కోప ముపసంహరింపఁజాలవయేని నీ యిచ్చవచ్చినట్లు దూఱు'' మని చెప్పి యర్జునుని పూనిక విరమింపఁజేసెను. అర్జునుఁడు క్రోధఘూర్ణితరక్తాక్షుఁడై ధర్మరాజు నసహ్యభాషణముల నిందించెను. కోప ముపశమించి మనస్సు శాంతప్రసన్నమగుట తోడనే యర్జునుఁడు ''నా క్షేమముఁగోరి కన్నబిడ్డవలెఁ బెంచి పెద్దచేసిన పితృతుల్యుఁ డగు ధర్మరాజును దూఱితిని గదా!'' యని వాపోయి యయ్యజాతశత్రువునకు నమోవాకము లొనర్చి, క్షమాపణను వేఁడి, యుద్ధమున *కనుజ్ఞాతుఁడై కృష్ణునితోడ బయలుదేఱెను.

అర్జునుఁడు తన శక్తి నంతటిని వినియోగపఱచి కర్ణు నితోఁ బోరసాగెను. 'నేఁ డర్జునునైనఁ జంపవలయు — లేదా నేనైనఁ జావవలయు' నను పట్టుదలతోఁ గర్ణుఁడును ప్రతిఘటించుచుండెను. ఆ సమరము ప్రేక్షకులకే భయంకర ముగా నుండెను. దానఁ 'గర్ణార్జునుల యుద్ధమువలె' నను నానుడి జగత్ప్రసిద్ధ మయ్యెను. సూర్యుఁ డపరాద్రిని సమీ పించుటతోడనే కర్ణునకుఁ గూడ కాలము సమీపించెను. విధి బలవత్తరముగదా! కృష్ణప్రేరితుఁడై యర్జునుఁ డొక దివ్యాస్త్ర మతనిపైఁ బ్రయోగింపఁ గర్ణుఁడు కురుబలంబులు 'హా హా' రావములు సేయుచుండ విగతజీవుఁడయ్యెను.

## (౮) ధర్మరాజు శల్యుని వధించుట

పిదప శల్యుఁడు సైన్యాధ్యక్షుఁడై సర్వతోభద్రవ్యూహ మును బన్నియుండుటఁ గాంచి పాండవులు మూఁడు మోహ

రంబుల ఘటించి యుద్ధము చేయసాగిరి. శల్యునితో ధర్మరాజు తలపడి తీవ్రముగఁ బోరాడ మొదలిడెను. శల్యుఁడు శరపరంపర నజాతశత్రునిపైఁ గురిపించి, యతనిని మూర్ఛాగతునిఁ జేసెను. ధర్మరాజు మూర్ఛఁదెలిసి మఱల శల్యునిపైఁ బడి యుద్ధముఁ గావించుచుండ సాత్యక్యాదు లతనికిఁ దోడ్పడిరి. ధర్మరాజు శల్యునిఁ దెగటార్పవలయునను నిశ్చయముతో సమరోద్ధతిఁ దన శక్తిసామర్థ్యములఁ జూపుచు శల్యుని మార్కొనుచుండెను. శల్యుఁడు మూర్ఛిల్లి మఱలఁ దేఱుకొని ధర్మరాజుపైఁ గవిసెను. ఇఁక లాభములేదని తన యింటఁ జాలకాలమునుండి పూజింపఁబడుచున్న శక్తినిఁగైకొని యభిమంత్రించి శల్యునిపై ధర్మరాజు ప్రయోగించెను. ఆ శక్తి హృదయముఁ జొచ్చి కొనిపోవ శల్యుఁడు గిరగిరఁ దిరుగుచు నేలఁబడెను.

శల్యుఁ డట్లు పడుటతోడనే యతని బంధువులెల్ల ధర్మరాజుఁ జుట్టుముట్టిరి. పిదప ఘోరసంగ్రామ మయ్యెను. ధర్మజుని ప్రతాపమునకు వారాఁగలేక పాఱిపోయిరి. తక్కుంగల పాండవు లందఱుఁ జెలరేఁగి శేషసైన్యముఁ దునుమాడి వీరవిహార మొనర్చిరి.

## (vi) దుర్యోధనుని మరణము

దుర్యోధనుఁడు 'నా' యనువారు లేకపోవుటచే వగచి విరక్తుఁడై హతశేషులై, ముఖ్యులైన కృపాశ్వత్థామ కృతవర్మలతోనైన నొక్కమాటఁ జెప్పక కాలినడకతో సమర

స్థలమును వదలి వెడలిపోయెను. సరాసరి దుర్యోధనుఁడు ద్వైపాయనహ్రదముఁ జేరి యందు దాఁగికొని యుండ సంజయుఁడు వెదకికొనుచు నతనిని సమీపించెను. దుర్యోధనుఁడును సంజయునితోఁ దనకుఁగల్గిన పరాభవపరంపరను, సర్వనాశనమును దెల్పి వాపోయి,ధృతరాష్ట్రునకుఁ జెప్పవలసిన మాటలఁ జెప్పి యతనిని బంపి తన జలస్తంభన విద్యావైదుష్యమునఁ జేసి యా హ్రదమున మునిఁగి యుండెను. కాలగతి యనతిక్రమణీయము గదా! ఈర్ష్యాళులకు, నధర్మవర్తనులకు నిట్టి హీనదశ సంప్రాప్తమగుటలో నాశ్చర్య మేమున్నది ?

పాండవభటులు ద్వైపాయనహ్రదమున దుర్యోధనుఁ డుండుట నెఱిఁగి భీమాదులకుఁ దెలిపిరి. ధర్మరాజు సోదరుల తోడను, పరివారముతోడను ఆ మడుగు డాయంజని దుర్యోధనునకు రోసమువోసి సమరోత్సాహముఁ గల్గింపనెంచి "రాజరాజా! ప్రపంచములో నిట్టి దైన్యమెందైనఁ గలదా? రాజు లసంఖ్యాకముగ నీకొఱకు యుద్ధమొనర్చి పరలోకగతులైరి. సోదరు లందఱును మృతులైరి. బంధుమిత్రులెందఱో నీకై పోరి మడిసిరి. నీ విట్లు జలములందు మునిఁగి నంత మాత్రమునఁ జావు తప్పునా? శూరుఁడవైన నీవు శత్రువులకు జడిసి మడువుఁ జొచ్చుట పాడిగాదు. విసర్జితక్షాత్రధర్ముల కిహముఁ బరముఁ గలుగునా? సభలో ద్రౌపది నాడిన మాట లప్పుడే మఱచితివా? రాజరాజా! తమ్ముల

దుర్మరణముఁ గనులారఁ గాంచి నీ వెట్లు బ్రతుకున కాస పడు చున్నావు? అంభోగర్భముఁ జొచ్చి గాంభీర్య, ధైర్యముల విడిచి యిట్లుండఁ బాండవులకు జడిసి సుయోధనుఁడు హ్రాద మున దాగెనని లోకు లనరా?'' అని ధర్మరా జాడిన మాటలకు రాజరాజు జలమునందుండియే సమాధాన మిచ్చుచు 'నే నిప్పు డాయాసముతో నుండుట యుద్ధము సేయఁజాల' నని తన మనోనిశ్చయముఁ దెలుపుచు ''ధర్మరాజా! రాజ్య మంతయు నీవే యేలుకొమ్ము. నే నరణ్యములఁ దపముఁ జేసికొనుచుండెద'' నన ధర్మరాజు వాని నంతటితో విడువక ''నీ వింతటి పిఱికి పందవా? మాకు రాజ్యమును నీ వీయం బనిలేదు. పౌరుష వృత్తిచేఁ గొందుము. మా కెన్నియో యిడుములఁ గలిగించితివి, అవసానదశ నిట్లు మాటలాడఁ దగదు. నీచేత మేమైనఁ జావవలయు—మాచేత నీవైనఁ జావవలయు. రాజ్య మిచ్చెద నన్నంతమాత్రముననే చావు తప్పించుకొనఁజాలవు. లెమ్ము. లెమ్ము. వీరోచితమార్గము ననుసరింపు'' మని పోటుమాట లాడ దుర్యోధనుఁడు హ్రదము వెడలి వచ్చి ''మీరు విజయోన్మాదమునఁ గాఱులు ప్రేలుచున్నారు. మద్భుజాబలదర్పంబున మిమ్మెల్లి ర నోడింతు'' నని భుజాస్ఫాలనముఁ గావించి పాండవులను సమీపించి నిలువంబడియెను.

ధర్మరాజు నయకోవిదుఁ డగుటచే సుయోధనునకు సంగరధర్మము లెఱింగించి ''రాజరాజా! నీకు వలయునాయుధ

ములఁగొని యుద్ధమొనర్పుము. ఏకాకివై యుండుట వలన మే మందఱము నీతోడఁ దలపడుట యధర్మము. మాలో నెవ్వరి నైనఁ గోరుకొని వానిని జయించిన, సగర్వముగఁ జతురంభోధిపరీతభూవలయము నేలుకొమ్ము. అట్లుగాక పరాజితుఁడవైన నాకసుఖాభ్యర్థివి కమ్ము'' అని వచింప నతండొడంబడి తుల్యబలవంతుఁడు, ప్రోద్ధతగదాయుద్ధపారీణుఁడునగు భీముఁడే తన కుద్ది యని యతనిం గనుంగొని వానితోఁ బోర నుంకించెను.

భీమదుర్యోధనులు విజృంభితాకారులై గదాయుద్ధనైపుణ్యమున నొండొరులపై సమధిక ప్రతాపముఁ జూపుకొను చుండ చూపఱకుఁ దొల్లింటి రామరావణయుద్ధము తలఁపునకు వచ్చుచుండెను. కొంతవడికి భీముఁడు డస్సెను. దుర్యోధనుని గదాఘట్టనములకు వాయుసూనుఁ డసుఱుసుఱగుటఁ గాంచి కృష్ణుఁ డర్జునునితో ''ధర్మయుద్ధమున భీముఁడు సుయోధను నోడింపలేఁడు. గదాయుద్ధమున నాభిప్రదేశమునకుఁ గ్రింద కొట్టఁగూడదను నియమ మొండు గలదు. కాని విజయకాంక్షితులమైన మన కధర్మచింత గలుగరాదు. తొడలపై దెబ్బఁగొట్టినఁగాని వీఁడు చావఁడు. భీముఁ డీ రహస్య మెఱుఁగునట్లు సంజ్ఞఁ గావింపు'' మనియెను. అర్జునుఁడు భీమునివైపు చూచుచుఁ దన తొడఁ గొట్టుకొనెను. ఆ సంజ్ఞను గమనించి భీముఁ డా మఱుక్షణముననే సుయో

ధనుని యూరుద్వంద్వముపై గదతోఁ గొట్టెను. 'మొదలు తెగిన మ్రాను'వలె దుర్యోధనుఁడు వెంటనే భగ్నోరుఁడై క్షోణితలంబున వ్రాలెను.

శత్రువులు నిశ్శేషముగా మరణించిరని పాండవులు పరమానంద భరితులగుచుఁ దమ తమ శిబిరములకు వచ్చి చేరిరి.

ఈశ్వరవరప్రసాది యైన యశ్వత్థామ పాండవశిబిరమున కర్ధరాత్రమునఁ జని ధృష్టద్యుమ్నాదులను, పాండవ కుమారు లగు నుపపాండవులను సంహరించి కృపాచార్య, కృతవర్మలఁ గలిసికొని తా నొనర్చిన ఘనకార్యము నెఱిఁగించెను. వారు ద్రౌణిసాహసమును మెచ్చుకొనిరి. వారు ముగ్గురును గలిసి ప్రాణావశిష్టుఁడై పడి యున్న రాజరాజు చెంత కేఁగి యతని వగపు నపనయించి యుపపాండవసంహార వృత్తాంతము నెఱుకపఱుప నతఁడు "మంచిపని చేసితి"రని చెప్పి సంతసించి భౌతిక దేహమును విడిచెను.

ధర్మరాజు పుత్రుల నిధనము విని శోకసంతప్తుఁడై సొలసి నేలపై వ్రాలెను. భీమార్జునులు శైత్యోపచారములఁ గావింప నతఁడు తేఱుకొని "అయ్యో, దైవమా! ఎచ్చటనైన నిట్టి విపరీతము కలదా? నిరవశేషముగ శత్రువులను జయించితి మని సంతోషించుచుంటిమే! అట్టియెడ నీ బంధు, మిత్ర, పుత్ర నాశనము కలిగినది కదా! అర్జునా! మనము పొందినది విజయముకాదు; పరాజయమే! రాజాధిరాజులను,

మహావీరులను జంపిన మన మిప్పుడొక బ్రాహ్మణుని మూల మున బంధు, పుత్రులఁ గోలుపోయితిమి. 'సముద్రము నీఁది యొక మురికి గుంటలోఁ బడి చచ్చినవాని'విధ మయ్యెను గదా మన బ్రదుకు!' అనుచు గద్గదకంఠుడై కుమారుల శవములను గవోష్ణ బాష్ప బిందువుల నభిషేకించెను.

## (vii) అంత్యక్రియలు

సాత్యకి ప్రయత్నమువలన నుపశమితదుఃఖుండై ధర్మజుఁ డుండ ద్రౌపది యచ్చట కేఁగుదెంచి శోకభరము నాఁపుకొనఁజాలక సుతుల కళేబరములపైఁబడి పలవించి దీనికంతకు నశ్వత్థామయే కారకుఁడని యెఱిఁగి 'ఆహా! గురుకుమారుఁ డింతటి పాపకార్య మొనర్చెనా? నిద్రాసక్తులై యున్న పసికందుల నే కారణమునఁ గృపాణమున కెర సేసెను? బ్రాహ్మణుఁడయ్యు నీ ఘోరకార్యమున కతఁడు వధ్యుఁడు సుమా! నే నీనాఁడు భీము నంపి యతనిని వధింపింపఁ జాలనేని ప్రాయోపవేశముఁ జేసి ప్రాణములు విడుతు''నని ప్రతిజ్ఞ గావించెను.

భీముఁడు ద్రౌపది ప్రతిజ్ఞ నెరవేర్ప గదా మండిత కరుఁడై యశ్వత్థామను వెదకుకొనుచుఁ బోవ ధర్మజ కృష్ణార్జును లతనికి సహాయపడుటకుఁ బోయిరి. అశ్వత్థామ కొంతతడవు పోరి జయము దుస్సాధ్యమగు టెఱిఁగి యప్రతి

హాతంబైన బ్రహ్మశిరోనామకాస్త్ర మా యర్జునునిపైఁ బ్రయోగించెను. కృష్ణప్రేరితుఁడై యర్జునుఁడును బ్రహ్మ శిరోనామకాస్త్రమును నైవఁ బ్రళయాగ్నివలె నగ్ని యా రెండింటినుండియు నుద్భవిల్లి లోకభయంకరముగ నుండెను. ముల్లోకములఁ గంపము జనించెను. పరాశరుని మూలమున నర్జునుఁ డశ్వత్థామశిరమునకు మారుగ మహాప్రభావయుక్త మగు శిరోమణిఁ గొని యస్త్రముల నుపసంహరించెను.

ఉత్తర యంతర్వత్నియై యుండుటవలన బ్రహ్మశిరో నామకాస్త్ర మా గర్భస్థ శిశువును బాధింపకుండునట్లు శ్రీకృష్ణుఁడు సుదర్శనచక్రమున నిరోధించి ధర్మారాజాదులతో నంతరింప నున్న పాండవవంశము నుద్ధరించెను. కృష్ణుని కరుణార్ద్రహృదయము నేమని పొగడఁగలము ?

ధర్మరాజు పుత్రశోకముతోఁ గుందెడు ధృతరాష్ట్ర గాంధారులఁ జూచు తలఁపు కల్గినవాఁడై దుర్యోధనుని భార్య లను వెంటఁబెట్టుకొని తమ్ములతోడఁ గలిసి హస్తినాపురము నకుఁ జనియెను. ధృతరాష్ట్రుఁ డందు లేకుండుటచేఁ దిరిగి కురుక్షేత్రమునకు వచ్చెను. రుధిరప్లావితమై, తన సకలైశ్వర్య ములను బుత్ర, మిత్ర, బంధుజనములను బలిగొన్న కురు క్షేత్రమును దర్శింప గాంధారీసమేతముగ ధృతరాష్ట్రుఁడు వచ్చె ననుమాట విని సహోదరాదులును, శ్రీకృష్ణుఁడును వెంట రాఁగా ధర్మరా జాతనిని సమీపించెను. ధృతరాష్ట్రుని

పరిజన "యితఁడు ధర్మములు దెలిసినవాఁ డెట్లగును ? కృప యనునది లేక తాతపాదులను, కొడుకులను, సోదరులను జంపివైచెను. క్రూరబుద్ధిఁ జేసి గురువులను, బంధువులను వధించెను. నెత్తుటఁ దోఁగిన రాజ్యభోగము లితని కెంత ప్రీతియో గదా ?" అని కొందఱును, 'అర్జునునితోఁ గలిసి భీష్మద్రోణాదుల నితఁ డెందుకు సంహరించెనో ?' అని మఱి కొందఱు ననుచుండ దించిన తల నెత్తకుండ ధర్మరాజు ధృతరాష్ట్రుని చెంత కేఁగి పార్శ్వవర్తులచేఁ దనరాక నెఱిఁగించి యాతని చరణముల కభివందన మాచరించెను.

ధృతరాష్ట్రుఁడు మనస్సున నెవ్వగ బాధించుచున్నను ధర్మజుని కౌఁగిట గ్రుచ్చి యెత్తి భీముఁ డన్నంతమాత్రమున మండిపడియెను. భీముని కౌఁగిలి నెపమున నుగ్గుసేయఁ దలఁచు ధృతరాష్ట్రు తలఁ పెఱిఁగి కృష్ణుఁ డయోమయ భీమప్రతిమ నతని చెంతఁ బెట్టఁగా దాని నతఁడు నుగ్గుచేసెను. కృష్ణుఁడు ధృతరాష్ట్రు నభిప్రాయ మందఱికిఁ దెలుప నతఁడు పశ్చాత్తాప మంది యథావిధిగ నాలింగనము సేసికొని వారలను గాంధారికడకుఁ బొమ్మని చెప్పి పీడ్కొలిపెను. ధృతరాష్ట్రునిచే ననుజ్ఞాతులై పాండవులు గాంధారికడకు వెళ్లి ప్రణమిల్లిరి. ఆమె యాశీర్వదించుటకు మాఱు ధర్మజుని శపింప నుండఁ గృష్ణద్వైపాయనుఁ డడ్డువచ్చి వారించెను. ఆమెయును దన పుత్రుల దుశ్చేష్టితములఁ దలపోసికొని

యూఁబడిల్లి వారలను దీవించి కుంతికడకుఁ జనుఁ డని చెప్పి పంపించెను.

కుంతి యుపపాండవనిధనమునకు వగచి వృద్ధ యగుటచేఁ బ్రణమిల్లిన పుత్రులను లేవనెత్తుచు నస్త్రశస్త్రముల వ్రణము లైన స్థలములఁ గాంచి కడుంగడు శోకించెను. ఎఱ్ఱఁబారిన గాయములఁ దిలకించి యామె పలవించుచుండ స్రస్తాలకయు, విసర్జితభూషణయు, ధూళిధూసరితవస్త్రయు నైన ద్రౌపది కుంతి పాదములపైని 'త్రెంచివైవ నెండకు వంగిన తీగ'చంద మున వ్రాలి యపత్యమరణముఁ గూర్చి యామెకడ వాపోవుచు నశ్రుపూరితనయన యయ్యెను. ద్రౌపది నూరడించి కుంతి పుత్రులతోఁడఁ గలిసి గాంధారీ, ధృతరాష్ట్రుల చెంత కేఁగెను.

గాంధారి తన పుత్రుల కళేబరముపైఁబడి విలపింప సాగెను. ధృతరాష్ట్రుఁడు 'యుద్ధమున గతించినవారల కెట్టి లోకములు గల' వని ధర్మరాజు నడిగిన నతఁ డిట్లుచెప్పెను. "యుద్ధమునఁ బ్రాణములఁ గోల్పోయినవారలు స్వర్గలోకమున రంభాదులఁగూడి భోగించుచు నింద్రునకుఁ బూజ్యులయ్యెదరు. శస్త్రాస్త్రముల ములుకులు తగిలి ధృతిసెడి, గుండె లవిసి ప్రాణములు విడిచినవారు గుహ్యకస్థానమున కేఁగుదురు. ఏ విధముగనైన రణమునఁ బంచత్వ మందినవారల కుత్తమలోక ప్రాప్తి గలదు" అని వివరింప ధృతరాష్ట్రుఁడు

''సనాథులకు, ననాథులకు దహనాద్యగ్నికార్యములను జరిపింపు'' మని ధర్మజున కాజ్ఞాపించెను.

ధౌమ్యుని యనుమతితో గంధ, ధూప, వస్త్ర, కస్తూరి, కుంకుమ, ఘృత, తిలాదులఁ బురోహితున కప్పగించి ధర్మరాజు భగ్నరథ, పతాక, బాణనిచయముతో వేర్వేఱఁ జితులేర్పఱచి పైతృక క్రియలు సల్పి ఋగ్యజుస్సామాథర్వణవేదంబులును, స్త్రీరోదనరవంబులును మిన్నుముట్టుచుండ రణనిహతులకు దహనకార్యముఁ గావించెను.

పిదప ధర్మరాజు గంగాస్నాన మాచరించి కౌరవుల కెల్లఁ దిలోదక ప్రదానముఁ జేయుచుండఁ గుంతి కన్నీరు మొగమెల్లఁ గ్రమ్మ జేవురింప నేడ్చుచు ''ధర్మతనయా! కౌరవులకుఁ దనవిల్లు పెట్టని కోటఁగాఁ జేసి, మీ యేవురికంటె నధికుఁడని దేవతలచే స్తుతింపఁబడిన కర్ణుఁడు రాధాపుత్రుఁ డనిలోక మనుటవలన మీ రదే నమ్మియుంటిరి. అది సరి గాదు. వాఁడు నా మొదటి పుత్రుఁడు. సూర్యానుగ్రహమున సహజకవచకుండలములతో జనించినవాఁడు. ఆ మహోన్నతునకుఁ దిలోదకము లొసఁగు బాధ్యత మీయది'' యని వాని జన్మప్రకారము నెఱిగింపఁ బాండవులు దుఃఖోద్విగ్నమానసులైరి. ధర్మరాజు తల్లడపడుచుఁ గుంతితో ''అమ్మా! సుయోధనుఁ డెవ్వనిబల మాశించి భీమార్జునులను మార్కొనుటకు సాహసించెనో, ఎవ్వని బాహుబలమున మన సైన్య

మెల్ల భయగ్రస్తమగుచుండెనో, ఎవ్వాని దివ్యాస్త్రమహిమ దేవతలకు సైత మద్భుత మనిపించెనో, మ హేమ్మ వీరచూడామణి యధికశక్తి సమరమునఁ జిక్కుపఱచెనో, అట్టి యోధాగ్రేసరుఁడగు కర్ణుని చరిత్రమును 'చీరకొంగున నగ్నిఁ డాఁచిన' ట్లే విధముగ డాఁచితివో చెప్పు'' మని విలపింప నారంభించెను. ధౌమ్యాదులు ప్రశాంత ధర్మబోధనముల నతని దుఃఖ మపనయింపఁ జేయ ధర్మజుఁడు విషాదశిథిలవర్ణంబులఁ గుల గోత్ర నామధేయముల నుచ్చరించి కర్ణునకుఁ దిలోదకప్రదానము సేసెను. తదనంతరము గర్ణునిభార్యలను రావించి మర్యాదలుసేసి యాతనికొఱకనేకపుణ్యకర్మములు నిర్వర్తించెను. బ్రాహ్మణులకు భూరిదక్షిణ లొసఁగి పైతృక క్రియలు యథావిధిగ నెఱవేర్చెను.

తదుపరి ధర్మరాజు సోదర, బాంధవులతో దుఃఖోపశమనార్థము గంగాతీరమం దొక కుటీర మేర్పఱచుకొని యందు నివసించుచుండెను. నారదుఁ డచటి కొకనాఁడే తెఱ నతనివలన సూర్యపుత్రుని జన్మప్రకారమును సవిస్తరముగ నెఱిఁగి కర్ణుని గుణగణములను, రణధురంధరత్వము, ననన్యసాధ్య దానశీలతను గొనియాడుచుఁ దమ కీ విషయముఁ దెలియజేయనందునకు కుంతిమీఁద వచ్చిన కోప మాఁపుకొనఁ జాలనివాఁడై ధర్మరాజు "ఏ లోకములందైనను, రహస్యమును రక్షించుకొనెడి శక్తి స్త్రీలకు లేకుండుఁగాక!'' యని శాపమిడెను.

ధర్మజుఁడు బంధునాశమునకై వగచుచుండఁ గృష్ణుఁడు "ధర్మరాజా! వగలఁ గుందెదవేల? ధరణీచక్రము నెల్లఁ బాలించి మహాబలపరాక్రమ సంపన్నులగు మహారాజు లెందఱు చావలేదు? జన్మించిన ప్రాణి మరణింపకుండు టెట్లు? జననమరణములు ప్రకృతి సహజములు—వానికై ప్రాకృత మానవునివలె వివేకి యగువాఁడు చింతింపఁదగ"దని షోడశ మహారాజుల చరిత్రములఁ దెల్పి విజ్ఞానబోధఁ గావించెను. ధర్మరా జంత విగతశోకుఁ డయ్యెను.

---

# 11

## ధర్మరాజ పట్టాభిషేకము

ఇట్లు కొంతకాలము గంగాతీరమునం దుండి పుణ్య కథాశ్రవణాదులఁ గాలముపుచ్చి కుంతీ, గాంధారీ, ధృతరాష్ట్రు లును, భీమార్జునాది సహోదరులును, శ్రీకృష్ణుఁడాదిగాఁగల బంధువర్గమును భర్తృవ్యసన కర్శితలగు కౌరవస్త్రీలును, పరిజనంబును వెంట నడుదేఱ ధర్మరాజు హస్తినాపురముఁ జేరుకొనియెను.

పౌరులతనికి ఘనస్వాగత మొసఁగిరి. భూసురాగ్రణులు వేదాశీస్సుల నిచ్చిరి. వందిమాగధులు కైవారంబులు సేసిరి. ధర్మరాజాదుల పురప్రవేశ మహోత్సవము నయనానందకరముగ

నుండెను. రాజవీథుల సపరివారముగ ధర్మరాజు జూరేగు చుండc బౌరకాంతలు సౌధాగ్రమ్ములందుండి ముత్యములను, లాజాక్షతలను నతనిపై వెదచల్లిరి. వారిని పుష్పములలో ముంచెత్తిరి. హస్తినాపుర మా దిన మానంద కోలాహల ముతో నిండి యుండెను.

పాండవపురోహితుడు ధౌమ్యుడు వృద్ధానుమతంబున శుభదమై, సౌఖ్యప్రదమై, మహోత్తమ మగు పట్టాభిషేక ముహూర్తమును నిశ్చయించెను. పంచాంగశుద్ధి గలిగి, గ్రహ పరస్పరమైత్రియును, శుభదృష్టితో నొప్పు నా ముహూర్త నిర్ణయమును దైవజ్ఞులు కొనియాడిరి. బ్రాహ్మణ శ్రేష్ఠు లా ధౌమ్యుని విజ్ఞానము నభినందించిరి.

పట్టణ మంతయు మామిడాకు తోరణముల నలంక రింపcబడియెను, వీథులc బన్నీరు చల్లింపcబడెను. చలువ పందిళ్లు వేయcబడెను. దేశమున నీ పట్టాభిషేకవార్తc జాటc బంపుటచేc 'దిరునాళ్ళకు వచ్చు'నట్లు జనులు గుంపులుగుంపులై వచ్చుచుండిరి. 'యజ్ఞముల కరుగుదెంచు'నట్లు శ్రౌత, స్మార్తాధ్యయనాది నిష్ఠాగరిష్ఠులును, షడ్దర్శనపారంగతులు నగు బ్రాహ్మణు లరుగుదెంచిరి. వారు వీ రననేల? ఈ పట్టాభి షేక వార్త చెవుల సోcకినవా రెల్లరును బ్రయాణమై యా మహా వైభవముc దిలకింప వచ్చిరి.

ధౌమ్యుఁడు పుణ్యాహవాచనాది మంగళాచరణములు సల్పెను. బ్రాహ్మణులు ఋక్కులు పఠింప, స్త్రీలు మంగళ గీతములు పాడ, వందిమాగధులు కైవారములు సేయ, నాసీనులైయున్న రాజశ్రేష్ఠులు మంత్రాక్షతలఁ జల్లుచుండ ధృతరాష్ట్రునాజ్ఞఁగొని ధర్మరాజును శాతకుంభపీఠముపైఁ గూర్చుండఁబెట్టి కనక కలశోదకముల నతని ధౌమ్యుఁ డభిషే కించెను. వేత్రహస్తులు ధర్మరాజున కిరుకెలఁకుల నిలుచుండిరి. ద్రౌపది వామపక్షమున నాసీన యయ్యెను. సోదరులు పాదములకడఁ గూర్చుండిరి. ధృతరాష్ట్రుఁ డతని నాశీర్వదించిన పిదప రాజవర్గ మెల్ల విధ్యుక్తముగఁ దమ తమ వినయ విధేయతలఁ బ్రకటించుచు ధర్మరాజునకుఁ గానుక లొసఁగిరి. ఏతద్విధముగ ధర్మజుని పట్టాభిషేక మహోత్సవము జయ ప్రదముగ జరిగెను.

యాచకుల కాంక్షితములఁ దీర్ప దీక్షితుఁడై ధర్మరా జడిగిన 'లే'దనక నందఱను ధన, కనక, వస్తు, వాహనాదుల సంతృప్తులఁ గావించెను. బ్రాహ్మణులకు భూరిదక్షిణలును, ధనధాన్యాద్యనేకాగ్రహారములను సమర్పించి వారి దీవన లంది సాగనంపెను. రాజులకుఁ జీనిచీనాంబరములను, రత్నా భరణాదుల నొసంగి గాఢపరిష్వంగములఁ దనిపి వీడ్కొలిపెను. ధర్మజుని వితరణముఁ గొనియాడని మానిసి లేఁడయ్యెను.

భీముని యువరాజుగ సల్పి, విదురుని మంత్రిత్వమునకు వేఁడి, సంజయుని కోశాధికారిగ నునిచి, చమూపతిగ నకులు

నేర్పాటుగావించి, పరరాజ్యాక్రమణాదుల నర్జునుని నియమించి, ధర్మకార్యాచరణములం దోడ్పడ ధౌమ్యునిం బ్రార్థించి, తన యాంతరంగిక వ్యవహారముల నరయ సహదేవుంగొని తది తరులకుం దగిన పనులు సెప్పి ధర్మరాజు తన రాజనీతిజ్ఞతను బ్రకటించెను.

ఏవంవిధబలసహాయసంపన్నుండై ధర్మరాజు ప్రజా పాలనమందు శ్రద్ధాళువై, సత్యధర్మముల కేమాత్రము హాని కలుగకుండున ట్లతిజాగ్రత్తతో రాజ్య మేలుచు మహేంద్రవైభవయుక్తుండై తన రాజ్యములో ధర్మదేవతను నాల్గు పాదములను నడిపించి యుగయుగాదర్శజ్యోతియై వర్ధిల్లెను.

విద్యార్థులారా !

ధర్మరాజు జీవితమంతయుం గష్టబహుళము—సుఖ లేశము పట్టాభిషేకమునాండు కూడ నతండు బంధుక్షయము నకు వగచెను—కాని, ధర్మపాలనముం జేయవచ్చునని మాత్రము సంతోషించెను. అతండు ధర్మమూర్తి! శాంత మూర్తి! క్షమామూర్తి!

ఈ శాంతమూర్తి జీవితము యుగయుగముల కాదర్శ మయ్యెను. నేంటినుండి మీకుగూడ నాదర్శ మగుగాక ! ఈతని చరిత్ర ధర్మవిజయమునకుం దార్కాణ యగును గాక !

సీ. ఎవ్వాని వాకిట నిభమదపంకంబు
రాజభూషణ రజోరాజి నడఁగు,
ఎవ్వాని చారిత్ర మెల్ల లోకములకు
నొజ్జయై వినయంబు నొఱపుఁ గఱపు,
ఎవ్వాని కడకంట నివ్వటిల్లెడు చూడ్కి
మానితసంపద లీనుచుండు,
ఎవ్వాని గుణలత లేఁడు వారాసుల
కడపటికొండపైఁ గలయఁ బ్రాఁకు,
తే. అతఁడు భూరిప్రతాప మహాప్రదీప
దూరవిఘటిత గర్వాంధకార వైరి
వీరకోటీరమణిఘృణి వేష్టితాంఘ్రి
తలుఁడు—కేవలమర్త్యుఁడే ధర్మసుతుఁడు!

(తిక్కన)

అసతో మా సద్గమయ!
తమసో మా జ్యోతిర్గమయ!
మృత్యోర్మా అమృతం గమయ!

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః